
Follow: @ANNTELUGU
21-11-2024
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 308 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM

ఆఫర్

## భాగ్యశ్రీకి మరో ఛాన్స్



మిస్టర్ బచ్చన్' సినిమాతో అందాల సందడి చేసిన భాగ్యశ్రీకి రామ్ సినిమాలో ఛాన్స్ దక్కింది. రామ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ - ఫీల్ గుడ్ వారు కలిసి ఒక ప్రాజెక్టును సెట్స్ పైకి తీసుకుని వెళుతున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమాలు గురువారం జరగనున్నాయి. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమాకి దర్శకత్వం వహించిన మహేశ్ బాబు పి, ఈ సినిమాకి దర్శకత్వం వహించనున్నాడు.

కౌంటర్

## ప్రజా విజయోత్సవాలు కాదు వంచనోత్సవాలు



- ఏ మొహంతో విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు
- బీజేఎల్పీ నేత ఏలేటి

02

బంపర్ ఆఫర్

## ఏపీలో రూ.99కే మద్యం



- జాతీయస్థాయి బ్రాండ్లు కూడా
- మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన

02



# కేటీఆర్.. ఊచలు లెక్కపెట్టిస్తా

## చంద్రమండలం పోయినా సరే కుట్రకు శిక్ష ఖాయం

- ఎంత దూరం ఉరుకుతవో.. ఉరుకు
- వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- అసెంబ్లీకి రా సామి.. ఒక్కసారి రా కేసీఆర్
- 80 వేల పుస్తకాల్లో ఏం చదివావో చర్చ చేద్దాం
- కరీంనగర్ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం
- రంగనాయకసాగర్ సేకరణ భూముల్లో హరీష్ ఫామ్ హౌజ్ కట్టుకున్నాడు
- కేసీఆర్ పదేళ్లలో చేయలేని పనులను మేం పది నెలల్లో చేసి చూపించాం

**వేములవాడ, మహా:** మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలి... 80 వేల పుస్తకాల్లో ఏం చదివారో చెప్పాలి.. అసెంబ్లీకి రా సామీ.. ఒక్కసారి రా. చర్చచేద్దాం అంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్నను కూడా కేసీఆర్ మోసం చేశారు. కేసీఆర్ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలో నిర్ణయించుకున్నా. కేటీఆర్ ఢిల్లీ కాదు చంద్ర మండలం పోయి ఫిర్యాదు చేసుకున్నా సరే చేసిన కుట్రకు నువ్వు ఊచలు లెక్కబెట్టాల్సిందే అంటూ బుధవారం వేములవాడలో నిర్వహించిన ప్రజా పాలనప్రజా విజయోత్సవ బహిరంగ సభలో తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

మిగతా 3లో






## గోల్డ్ లోన్లకూ ఈఎంఐలు

న్యూఢిల్లీ, మహా: గోల్డ్ లోన్లకూ త్వరలో ఈఎంఐలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా తదితర రుణాలకే నెలవారీ వాయిదా ఈఎంఐ సౌకర్యం ఉన్నది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే అప్పలకు ఈ సదుపాయం లేదు. అయితే ఈ రుణాల మంజూరులో ఆర్బీఐ రకరకాల లోపాలను గుర్తించింది.

మిగతా 7లో



## మరో మార్గంలో కొత్తగా వందే భారత్ రైలు..

మహా: భారతీయ రైల్వేశాఖ కొత్తగా మరో రూట్లో వందే భారత్ రైలును ప్రవేశపెట్టనున్నది. ఇప్పటికే సెమీ హైస్పీడ్ రైలు దేశవ్యాప్తంగా 50కిపైగా మార్గాల్లో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఈ కొత్త రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలోనే మరికొద్ది మార్గాల్లో రైల్వేశాఖ సెమీ హైస్పీడ్ రైళ్లకు శ్రీకారం చుట్టబోతున్నది.

మిగతా 7లో

# కమల వికాసమే

## మహారాష్ట్ర, జార్ఖండ్ ఎగ్జిట్ పోల్స్

### రెండు రాష్ట్రాలు బిజెపి కూటమి వైపే


మహారాష్ట్రలో 150-195 సీట్లు వస్తాయంటూ సర్వేలు


జార్ఖండ్‌లో హోరాహోరీ.. ఎన్డీఏకే మొగ్గు



మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి సంచలన విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. బధవారం జరిగిన పోలింగ్ లో ఓటర్లు భారీగా ఓటు హక్కు వినియోగించగా, భారతీయ జనతాపార్టీ మిత్రపక్షాలు సంచలన విజయాలు నమోదుచేస్తాయన్న అంచనాలు వెలువడ్డాయి. సంకీర్ణ ప్రభుత్వానికి మహా ప్రజలు ఏకపక్షంగా మద్దతిచ్చారన్న అంచనాలు వెలువడుతున్నాయి. బిజెపి కూటమికి 48శాతం, కాంగ్రెస్ కూటమికి 42శాతం ఓట్ల బదిలీ జరిగిందన్న చర్చ ఉంది. అసలు ఫలితం బయటకు వస్తే గానీ.. లెక్క తేలదు. -మహా, ఢిల్లీ

వివరాలు 2లో




### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,620 |
| 22 క్యారెట్ | 71,150 |
| సిల్వర్ (కేజీ) | 92000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 77,578.38 |
| నిఫ్టీ ↗ | 23,518.50 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 210 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ ₹ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.50 | 165 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.50 | 165 |
| రిటైల్ గుడ్డు ధర | 5.83 | 174.9 |




# స్కామ్‌కే స్కామ్

## రూ.3500 కోట్లను మామ కొట్టేశాడు..

### కట్ చేస్తే..ఊహించని ట్విస్ట్

రూ.3500 కోట్ల రూపాయలను మామ కొట్టేస్తే..దోచుకున్న డబ్బుకే ఓ వాచ్ మెన్ మళ్ళీ కన్నం వేసిన ఘటన హైదరాబాద్‌లో సంచలనంగా మారింది. హైదరాబాదులో ఇటీవల చోటు చేసుకున్న అతిపెద్ద భారీ స్కామ్ సాహితీ ఇన్రాఫ కేసు... అసలు స్టోరీ ఏంటంటే?

రూ.3500 కోట్ల రూపాయలను మామ కొట్టేస్తే.. దోచుకున్న డబ్బుకే ఓ వాచ్మెన్ మళ్ళీ కన్నం వేసి కొట్టేశాడు. ఈ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. హైదరాబాదులో ఇటీవల చోటు చేసుకున్న అతిపెద్ద భారీ స్కామ్ సాహితీ ఇన్రాఫ కేసు.. ఈ స్కామ్‌తో వందల కోట్ల కొద్ది రూపాయలు డిపాజిటర్ల నుండి సేకరించి భారీ మొత్తంలో కుంభకోణానికి పాల్పడ్డాడు సాహితీ ఇన్రాఫ చైర్మన్ లక్ష్మీనారాయణ.. ఇప్పటికే ఈ స్కామ్‌లో గతంలో పోలీసులు అరెస్టు చేయగా తాజాగా ఈడీ అధికారులు సాహితీ చైర్మన్‌ను అరెస్టు చేశారు. అయితే తాజాగా ఆయన కోడలు అఖిల రెడ్డి ఇంట్లో భారీ చోరీ జరిగింది.

మిగతా 2లో

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వయస్సు పెంపు

- 60 నుంచి 62 ఏండ్లకు
- క్యాబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ, మహా :** కేంద్ర ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏండ్లకు పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను ఎక్కువ కాలం పొందడం వల్ల పరిపాలన మెరుగు పడుతుందని కేంద్రం భావిస్తుంది.

మిగతా 2లో

తెలంగాణ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

## త్వరలో 3,500 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

### ఈసారి విద్యుత్ శాఖ వంతు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుస నోటిఫికేషన్లు విడుదలవుతుండగా, నిరుద్యోగులు వరుస నోటిఫికేషన్లతో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. వరుసగా పరీక్షల షెడ్యూల్ సైతం విడుదల అవుతున్నాయి. నవంబర్ నెల నుంచి జనవరి వరకు వరుసగా పోటీ పరీక్షలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా మరో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి విద్యుత్ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వదం కసరత్తు చేస్తుందని తెలుస్తోంది.11 మాసాల్లో ఇప్పటికే 50వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తిచేసిన రేవంత్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 3,500 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

మిగతా 2లో



## చలి పంజా

03

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు

## హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాలకు చెక్

### ఎలివేటెడ్ కారిడార్లకు ప్రాథమిక నోటిఫికేషన్

నాలుగు నెలల్లో ప్రారంభం కానున్న పనులు

డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

**హైదరాబాద్, మహా :** గ్రేటర్ లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు తొలి డబుల్ డెక్కర్, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు మరో ముందడుగు పడింది. జంట నగరాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై కొద్ది రోజుల క్రితం ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించిన విషయం తెలిసిందే.



మిగతా 3లో

## ఆడ తోడు కోసం.. టైగర్ జానీ ప్రేమయాత్ర..!

- నెలరోజులుగా అలుపెరుగని నడక
- మహారాష్ట్ర నుంచి తెలంగాణకు 340 కి.మీ ప్రయాణం



03

# కమల వికాసమే



**ఢిల్లీ, మహా:** మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి సంచలన విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. బధవారం జరిగిన పోలింగ్ లో ఓటర్లు భారీగా ఓటు హక్కు వినియోగించగా, భారతీయ జనతాపార్టీ మిత్రపక్షాలు సంచలన విజయాలు నమోదుచేస్తాయన్న అంచనాలు వెలువడ్డాయి. సంకీర్ణ ప్రభుత్వానికి మహా ప్రజలు ఏకపక్షంగా మద్దతిచ్చారన్న అంచనాలు వెలువడుతున్నాయి. బిజెపి కూటమికి 48శాతం , కాంగ్రెస్ కూటమికి 42శాతం ఓట్ల బదిలీ జరిగిందన్న చర్చ ఉంది. అసలు ఫలితం బయటకు వస్తే గానీ.. లెక్క తేలదు. అన్ని సర్వేలు 150 నుండి 195 వరకు మహాయుతి గెలుస్తుందని స్పష్టం చేశాయి. హర్యానాలో సర్వే అంచనాలు తప్పడంతో.. ఈసారి సర్వే సంస్థలు మరింత జాగ్రత్త తీసుకున్నాయి. అయితే ఫలితం ఎలా ఉంటుందో చూడాలి. ఎగ్జిట్ పోల్స్ పై బిజెపి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహాయుతి 200మార్కును దాటుతుందని ధీమాగా చెబుతున్నారు. కాంగ్రెస్ కూటమికి 80 నుండి 110 వరకు రావొచ్చన్న అంచనాలు చెబుతున్నారు.

**అందరి దృష్టి ఎగ్జిట్ పోల్స్ పైనే**

పోలింగ్ ముగిసిన వెంటనే అందరి దృష్టి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే కొన్ని రోజుల క్రితం హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసిన ఫలితాలకు.. ఎన్నికల సంఘం ప్రకటించిన తుది ఫలితాలకు పొంతన లేక పోవడంతో తాజాగా మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఏ విధమైన ఎగ్జిట్ పోల్స్ వెలువడుతాయి అనేది అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. మహారాష్ట్రలో 288 సీట్లు ఉండగా.. మేజిక్ ఫిగర్ 145. ఇక జార్ఖండ్‌లో 81 సీట్లు ఉండగా.. మేజిక్ ఫిగర్ 41.

## అమెరికాపై అణుబాంబులేయడానికి పుతిన్ రెడీ

### కొత్త ఫైల్‌పై సంతకం - బైడెనే కారణం !



బైడెన్ అమెరికాను చిక్కుల్లో నెట్టేసి.. ప్రమాదంలో బిగించారు. పదవి నుంచి దిగిపోయే ముందు అమెరికా అధ్యక్షుడు బైడెన్ .. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను రెచ్చగొట్టారు. తాము అందజేసే లాంగ్ రేంజ్ క్షిపణులను రష్యాపై ప్రయోగించేందుకు ఉక్రెయిన్ కు అనుమతి ఇచ్చారు. ఉక్రెయిన్ వీటిని ప్రయోగించడం కూడా ప్రార దీంతో పుతిన్ తమ అణుపాలసీని మరింత సరళీకృతం చేస్తూ కొత్తగా నిర్ణయం తీసుకున్నారు. నూతన అణ్వాయుధ సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ పాలసీ ప్రకారం ఉక్రెయిన్ కు తమపై దాడి చేసేందుకు ఆయుధాలు ఇచ్చే దేశాలపైనా రష్యా అణుదాడి చేస్తుంది.అలాంటి దేశాలు తమ శత్రువులేనని రష్యా ప్రకటించింది. అంటే ఇప్పుడు ఉక్రెయిన్ కు లాంగే రేజ్ క్షిపణులు ఇస్తోంది.. దాడికి అనుమతులు ఇచ్చింది అమెరికా కాబట్టి.. రష్యా అమెరికైపైనా దాడి చేస్తుందన్నమాట.

## త్వరలో 3,500 ఉద్యోగాల
# భర్తీకి నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని నిరుద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో తీపికబురు చెప్పనున్నారు. త్వరలోనే భారీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగానే జాబ్ క్యాలెండర్ ప్రకారం నియామకాలు పూర్తి చేసే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు నోటిఫికేషన్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మరో నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్తు పంపిణీ సంస్థల్లో జూనియర్ లైన్‌మెన్ ఖాళీల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా మొత్తం 3,500 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

**టీజీఎస్‌పీడీసీఎల్‌లో 1,550 వరకు జూనియర్ లైన్‌మెన్ పోస్టులు**

హైదరాబాద్ కేంద్రంగా ఉన్నవిద్యుత్తు పంపిణీ సంస్థతో పాటు, వరంగల్ కేంద్రంగా ఉన్న విద్యుత్తు పంపిణీ సంస్థలలో భారీగా ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించినట్లు తెలుస్తోంది. మొత్తం ఈ విద్యుత్ పంపిణీ సంస్థలలో మొత్తం 3,500 వరకు జూనియర్ లైన్‌మెన్, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆర్థిక శాఖ గుర్తించింది. ఈ మేరకు ఈ పోస్టుల భర్తీకి నవంబర్ నెలాఖరుకల్లా నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పోస్టులలోనే టీజీఎస్‌పీడీసీఎల్‌లో 1,550 వరకు జూనియర్ లైన్‌మెన్ పోస్టులు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఈనెలాఖరుకల్లా నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# స్కామ్‌కే స్కామ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ చోరీపై ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.వందల కోట్ల రూపాయల స్కామ్‌లో కీలక సూత్రధారి సాహితీ చైర్మన్ లక్ష్మీనారాయణ.. ఆయన కోడలు అఖిలారెడ్డి జూబ్లీహిల్స్ లో నివాసం ఉంటుంది. కొద్ది నెలల క్రితం ఆమె బెంగుళూరుకు వెళ్లాల్సి ఉన్న తరుణంలో తన వాచ్ మెన్ సురేష్‌ను పిలిచి ఇంటిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పింది. నెలలు గడుస్తున్న అఖిలారెడ్డి హైదరాబాద్‌కు తిరిగి రాకపోవడంతో ఇంట్లో ఉన్న సొత్తును కాజేసేందుకు సురేష్ అండ్ కో ప్లాన్ చేశారు. తనకు తెలిసిన స్నేహితులను పిలిపించి ఇంటి మొత్తానికి కన్నం వేశారు. లక్షల కొద్ది రూపాయలు విలువ చేసే బంగారంతో పాటు ఆభరణాలను చోరీ చేశారు. చోరీ చేసిన సొత్తు మొత్తాన్ని దుకాణంలో పెట్టి డబ్బులు దండుకున్నారు. అయితే తాజాగా బెంగళూరు నుండి హైదరాబాద్‌కు వచ్చిన అఖిలారెడ్డికి విషయం తెలిసి అవాక్కయింది.ఇంటిని చూసుకోమన్న వాచ్ మెన్ మొత్తం సొత్తును కాజేసి వ్యాపారి దగ్గర పెట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు చోరీకి పాల్పడ్డ నిందితులతోపాటు ఈ సొత్తు కొనుగోలు చేసిన వ్యాపారిని సైతం జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి భారీగా ఆభరణాలు రికవరీ చేసారు.

## ఎఫ్‌బీఐ డైరెక్టర్ పదవికి
# ట్రంప్ ఇంటర్వ్యూలు!

**అమెరికా :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ తన ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా ఎఫ్‌బీఐ డైరెక్టర్ బాధ్యతల నుంచి క్రిస్టోఫర్ వ్రేను తొలగించనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఆ పదవికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ట్రంప్ రన్నింగ్‌మేట్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జేడీ వాన్స్ ఓ పోస్ట్ ద్వారా వెల్లడించారు. అయితే, వెంటనే ఆ పోస్టును డిలీట్ చేయడం గమనార్హం. 'అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌ను కలవనున్నాను. ఎఫ్‌బీఐ డైరెక్టర్‌తో సహా మా ప్రభుత్వం కోసం అనేక స్థానాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాం' అని వాన్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. తరువాత ఆ పోస్టును తొలగించారు. ఇక, గతంలోనూ ఓ శక్తివంతమైన ఎఫ్‌బీఐ డైరెక్టర్ కావాలంటూ వాన్స్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ప్రస్తుతం ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా ఉన్న క్రిస్టోఫర్ వ్రేకు ట్రంప్ ఉద్వాసన పలకనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఎఫ్‌బీఐ ప్రతినిధులు స్పందించేందుకు నిరాకరించారు. 'ట్రంప్ తన కార్యవర్గంలో ఎవరు పనిచేయాలనే దానిపై ఆయనే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆ నిర్ణయాలను ఆయనే స్వయంగా ప్రకటిస్తారు' అని ట్రంప్ ట్రాన్సిషన్ టీమ్ ప్రతినిధి వెల్లడించారు.




**విద్యాశాఖ మంత్రిగా లిండా మెక్‌మాన్..**

ట్రంప్ తన కార్యవర్గ విస్తరణలో భాగంగా ప్రపంచ కుబేరుడు ప్రొఫెషనల్ రెజ్లర్ అయిన లిండా మెక్‌మాన్ ను విద్యాశాఖ మంత్రిగా నియమించారు. మెక్‌మాన్ 2009 నుంచి కనెక్టికట్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఓ ఏడాది పాటు పనిచేశారు. ఆ తరువాత ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు స్మాల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌కు కొంతకాలం నాయకత్వం వహించారు.

## ప్రజా విజయోత్సవాలు కాదు... వంచనోత్సవాలు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ నిర్వహిస్తున్నవి ప్రజా విజయోత్సవాలు కాదని... వంచనోత్సవాలు అని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. హామీలు నెరవేర్చని రేవంత్ రెడ్డి ఏ మొహంతో విజయోత్సవాలు నిర్వహిస్తున్నారో చెప్పాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్లను ప్రస్తావించే నైతిక అర్హత కూడా ముఖ్యమంత్రికి లేదన్నారు. కిషన్ రెడ్డి... మోదీ బానిస అని తీవ్ర విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి అదే సభలో సోనియా కాళ్లు కడిగి నెత్తిమీద పోసుకుంటానని వ్యాఖ్యానించడం గమనార్హమన్నారు. గతంలో సోనియా గాంధీని బలిదేవత అన్న వ్యక్తి కూడా ఈ రేవంత్ రెడ్డే అని గుర్తు చేశారు. తన పదవిని కాపాడుకోవడానికి రేవంత్ ఏ స్థాయికి దిగజారారో తెలిసిపోతోందన్నారు.



# చలి పంజా

### పడిపోతున్న ఉష్ణోగ్రతలు
### ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుతున్నాయి. ఉదయం 10 గంటల వరకు చాలా ప్రాంతాల్లో పొగ మంచు కప్పేస్తోంది. పొగమంచు కారణంగా రహదారులపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలో గరిష్ఠంగా గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ రెండు జిల్లాల్లలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు పడిపోతున్నట్లు అధికారులు వివరించారు. ఇక హైదరాబద్ శివారు ప్రాంతాల్లోనూ చలి పులి పంజా విసురుతోంది. కొన్ని ఏరియాల్లో 15 డిగ్రీలకు దిగువన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

## గవర్నర్ వద్ద ఫైల్...
# సందిగ్ధంలో బీజేపీ!
### నిర్ణయమేమైనా జవాబు తప్పదా..?

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర రాజకీయాలలో ప్రస్తుతం బాంబుల మోత మోగుతోంది. రోజుకో నేత ఎక్కడో ఒక చోట త్వరలోనే అరెస్టుల బాంబు పేలుతుందంటూ చేస్తున్న ప్రకటనలు వినేందుకు బాగానే ఉన్నా ఎప్పుడు పేలుతుందా అన్న చర్చ ప్రజల్లో జోరందుకుంది. ఈ రేసింగ్ చెల్లింపుల్లో అక్రమాలతో పాటు అధికారంలో ఉన్నప్పుడు పలు ప్రాజెక్టులలో జరిగిన అవినీతిపై మాజీ మంత్రి కేటీఆర్ పై విచారణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదేశించింది. ఈ కేసులలో కేటీఆర్ అక్రమాలకు పాల్పడ్డట్లు తేలిందని, అరస్టుకు అనుమతి కోరుతూ గవర్నర్ కు లేఖ రాసినట్లు మంత్రులు అనేక సందర్భాలలో వెల్లడించారు. ఇదే అంశం ప్రస్తుతం బీజేపీని కలవరానికి గురి చేస్తోంది. అరెస్టు చేస్తే చేసుకోండి, భయపడనని కేటీఆర్ స్పష్టం చేసినప్పటికీ ఆయన అరెస్టు తమ మెడకు చుట్టుకుంటే పరిస్థితి ఏమిటన్నది ప్రస్తుతం కాషాయ నేతలు వేధిస్తున్న సమస్య. త్వరలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. కేటీఆర్ అరెస్టయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ ప్రభావం తమపై పడుతుందని కమలనాథులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని బీఆర్ఎస్ విస్తృత ప్రచారం చేస్తోంది. నిజంగా కేటీఆర్ అరెస్టయితే ప్రజల్లో ఇంతకాలం గులాబీ పార్టీ చేసిన ప్రచారం నిజమేనని నమ్మేస్తారేమోనన్న ఆదుర్థ బీజేపీ నేతల్లో వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో ఫలితాలను రాబట్టలేకపోయిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం సత్తా చాటింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో చతికిలపడింది. బీఆర్ఎస్ఓటు బ్యాంక్ ను తమ వైపు తిప్పుకోవడంతో పాటు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయ శక్తిగ ఎదగాలనుకుంటున్న బీజేపీకి కేటీఆర్ ను అరెస్టు చేస్తే పిడుగుపడ్డట్లు అవుతుందని భావిస్తోంది. రేవంత్ రెడ్డి ఏడాది పాలనపై విజయోత్సవాలను నిర్వహిస్తుంటే వైఫల్యాలంటూ పాదయాత్రలకు సిద్ధమవుతున్న తరుణంలో గవర్నర్ నిర్ణయం కేటీఆర్ కు వ్యతిరేకంగా వస్తే పరిస్థితి ఏమిటన్న సందిగ్ధంలో కాషాయనేతలున్నారు.

**నాణానికి మరో వైపు**

మరోపక్క కేటీఆర్‌ను విచారించే విషయంలో గవర్నర్ నిర్ణయం ఆలస్యమవుతుండటం పట్ల బీజేపీ ఆందోళన చెందుతుంది. బీజేపీబీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం కమలం పార్టీని టెన్షన్ పెడుతోంది కూడా. కేటీఆర్ విచారణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం రాసిన లేఖను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అటార్నీ జనరల్ అభిప్రాయం కోసం పంపించారు. ఇదే సమయంలో కేటీఆర్ బీజేపీ అధిష్టానంతో కుమ్మక్కై తనపై విచారణ జరగకుండా మేనేజ్ చేసుకున్నారని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది. ర్ ఢిల్లీ వెళ్లి కేటీఆర్ కేంద్రప్రభుత్వ పెద్దలతో రహస్యంగా మాట్లాడి, గవర్నర్ అనుమతి ఇవ్వకుండా మాట్లాడుకున్నారని మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఆరోపణలు మొదలు పెట్టారు. అంతేకాకుండా గవర్నర్ కూడా కేటీఆర్ ఢిల్లీ వెళ్లిన సమయంలోనే హస్తినకు వెళ్లడం, ఆ తర్వాత కేటీఆర్‌పై విచారణకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కాంగ్రెస్ నేతలు విమర్శల దాడి ఇంకా పెంచుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తే ఏంటి పరిస్థితి అన్న ఆందోళన కూడా బీజేపీని వేధిస్తోంది. కాంగ్రెస్ కు ధీయుగా బీజేపీ దేశ వ్యాప్తంగా యుద్ధం ప్రకటించి పోరాటం చేస్తోంది. తెలంగాణలోనూ హోరాహోరి పోరాటం చేయాలనుకుంటున్న కమలం పార్టీకి గవర్నర్ నిర్ణయం ఏమిటన్నది స్పష్టంగా తెలియక పోవడంతో ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో నేతలున్నారు. కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి ఆలస్యమయ్యే కొద్ది బీజేపీబీఆర్ఎస్ ఒక్కటేనన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయన్న టెన్షన్ నేతలను పట్టి పీడిస్తోంది. ఇంకా లేటైతే కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్లు బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యామన్న విమర్శలు ఎక్కువయ్యే అవకాశం ఉందని నేతలు మధన పడుతున్నారు.. కేటీఆర్ విచారణ విషయంలో గవర్నర్ ఏ నిర్ణయం తీసుకున్నా తాము సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందని కాషాయాధినేతలు తలలు పట్టుకుంటున్నారు




ఒకవేళ కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతివ్వకపోతే పార్టీపై ప్రజల్లోకి తప్పుడు అభిప్రాయాలు వెళ్లే అవకాశం ఉందని, కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ప్రత్యాశక్తిగా ఎదగాలనుకుంటున్న లక్ష్యానికి తూట్లు పడే అవకాశం ఉదని భావిస్తున్నారు. మొత్తం మీద కేటీఆర్ విచారణపై గవర్నర్ ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారని కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీజేపీ నేతలే ఎక్కువగా ఎదురుచూస్తున్నారు. ఈ కార్ రేస్‌లో కేటీఆర్‌ను విచారించే అంశంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏ నిర్ణయం తీసుకోబోతున్నారన్నది బీజేపీలోనే కాదు, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే బీజేపీ పరిస్థితి పరిస్థితి మాత్రం ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లుగా తయారైందన్న చర్చ మాత్రం జోరందుకుంది.

### ఏపీలో మందుబాబులకు శుభవార్త..
## రూ.99కే మద్యం



**మహా, అమరావతి:** ఏపీలో మద్యానికి సంబంధించి మంత్రి కొల్లు రవీంద్ర కీలక ప్రకటన చేశారు. జాతీయ స్థాయిలో పేరొందిన కంపెనీలతో కూడా రూ.99కే మద్యం అమ్మించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.99 మద్యానికి మంచి ఆదరణ వస్తోందని.. ఇప్పటి వరకు 5 లక్షకేసులకు పైగా విక్రయాలు జరిగాయి అన్నారు. జాతీయ స్థాయిలో పేరొందిన సంస్థలు సైతం ఈ మద్యం అమ్మకాలు ఎలా ఉన్నాయో చూస్తున్నట్లు తెలిపారు. అవి కూడా ఉత్పత్తి సామర్థ్యం పెంచుకుని ఆ తర్వాత నాణ్యమైన మద్యం సరఫరా చేస్తాయన్నారు. ఇప్పటికే పలు కంపెనీలతో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వయస్సు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవానికి ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా మరోవైపు ఇప్పుడున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచటంపై నిరుద్యోగుల్లో సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ ప్రతిపాదన చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు ముందుగా కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఆమోదం పొందటం గమనార్హం. ఈ నిర్ణయం ఏప్రిల్ 1, 2025 నుంచి అమల్లోకి వస్తుంది.



## కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో
# కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు
### కండవాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో చేరికలు ముమ్మరంగా కొన సాగుతున్నాయి. ప్రజా సేవాభవన్ ప్రతీ రోజు జన జాతరను తలపిస్తోంది. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు నోముల చంద్రకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మడవి కిషన్,ఎల్మ రామ్ రెడ్డి,గంగన్న,ముత్తన్న,నగేష్, రమేష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తరలివచ్చారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి చప్పట్లతో పార్టీలోకి స్వాగతించారు. పార్టీ కి క్యాడర్ ఎంతో ముఖ్యమైందని అది కాపాడుకోవలసిన బాధ్యత ప్రతీ నాయకుడిపై ఉంటుందన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో నాయకుల కృషి వల్ల పార్టీ బలోపేతమవుతందన్నారు. ఎలక్షన్లు ఏవి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. అంకోలి గ్రామానికి 300 ఇల్లు ఇప్పిస్తానన్నారు. తెలంగాణ ప్రభుత్వం 500 లకే గ్యాస్ సిలిండర్ , 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సదుపాయం కల్పించిందన్నారు.పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ముందుగా ఇస్తామన్నారు. అంకోలి గ్రామ అభివృద్ధికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఎప్పుడు ఏ పని మీద అదిలాబాదుకు వచ్చినా తన క్యాంప్ కార్యాలయానికి వచ్చి భోజనం చేయాలని కోరారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ లను, జడ్పీటీసీ లను ఎంపీటీసీ లను గెలిపించాలన్నారు.ఏ ఎలక్షన్లు వచ్చిన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయటమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునుచ్చారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు ,కౌన్సిలర్ బండారి సతీష్,ఆదిలాబాద్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అక్బర్,నాయకులు సుధాకర్ గౌడ్,బత్తుల శ్రీనివాస్,సింగిరెడ్డి రామ్ రెడ్డి,ఎం.ఏ కయ్యుమ్,మొహమ్మద్ రఫీక్,మానే శంకర్,రాజా లింగన్న,అశోక్,అన్నెల శంకర్,పవర్ వసంత్,అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్.. ఊచలు లెక్కపెట్టిస్తా

## చంద్రమండలం పోయినా సరే కుట్రకు శిక్ష ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

త్వరలోనే మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాయిదా పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి మంత్రి ఉత్తమ్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈనెల 30న మరోసారి ఉత్తమ్కుమార్రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని వెల్లడించారు.

'' ఇందిరమ్మ రాజ్యంలో వేములవాడను అభివృద్ధి చేసుకుంటున్నాం. మిడ్ మానేరు ముంపు బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని ఆనాడే మాట ఇచ్చాం. త్వరలోనే పరిష్కరిస్తాం. కలికోట సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. కాంగ్రెస్ హయాంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పూర్తవుతాయని ఆనాడే చెప్పా. ఈ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నవంబర్ 30లోగా జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష చేస్తారు. దేశానికి దశదిశ సూచించిన నేత పీవీ పుట్టిన గడ్డ కరీంనగర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ఈ కరీంనగర్ గడ్డపై నుంచే సోనియమ్మ మాట ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎంత త్యాగానికైనా సిద్ధమవుతుందని సోనియమ్మ నిరూపించారు. కరీంనగర్‌లో బీజేపీని గెలిపిస్తే జిల్లాకు ఏం ఒరిగింది? కరీంనగర్ అభివృద్ధి కోసం బండి సంజయ్ పార్లమెంట్‌లో ఎప్పుడైనా ప్రశ్నించారా? జిల్లా అభివృద్ధికి చిల్లి గవ్వ తెచ్చారా ?. అలా చేసి ఉంటే జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలేవా? అని సీఎం ప్రశ్నించారు.

**మీ నొప్పికి మందు మా కార్యకర్తలకు తెలుసు**

పదేళ్లలో రూ.20లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. రూ.100 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి ఎందుకు చేయలేదు ?. ప్యాకేజీ 9 ఎందుకు పూర్తి చేయలేదు?. గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రమాదవశాత్తు మరణించిన గల్ఫ్ కార్మికులకు రూ.5లక్షల ప్రమాదబీమా అందిస్తున్నాం. కేసీఆర్ పదేళ్లలో చేయలేని పనులను మేం పది నెలల్లో చేసి చూపించాం. ఏలేశ్వరం పోయినా శనేశ్వరం వదలలేదన్నట్లు.. వాళ్లను ఓడించినా వాళ్ల తీరు మారలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా వచ్చింది.. ఇప్పుడు వాళ్ల వేషాలు చూస్తుంటే వాళ్ల మెదడు కూడా పోయినట్టుంది. పదేళ్లు ఏం వెలగబెట్టారని.. పదినెలల్లో మనల్ని దిగి పొమ్మంటున్నారు ?. మీ నొప్పికి మా కార్యకర్తలకు మందు ఎక్కడ పెట్టాలో తెలుసు. రుణమాఫీపై దుష్ప్రచారం చేసున్న మీకు.. ధైర్యం ఉంటే నిజాన్ని ఎదుర్కొనే సత్తా ఉంటే అసెంబ్లీకి రా. మా వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెబుతారు.

**లెక్క కట్టి చూపిస్తా**

పది నెలల్లో 50వేల ఉద్యోగాలు ఇచ్చాం. లెక్క కట్టి చూపిస్తా. ఒక్క తల తగ్గినా నేను క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా. మీ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో.. మా పదినెలల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో చర్చకు పెడదాం రా. ఆనాడు వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన చరిత్ర కేసీఆర్‌ది. కానీ ఇప్పుడు 66 లక్షల 1కోటి 53లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండింది. ఆయన కట్టిన కాళేశ్వరం కుంగిపోయినా.. ఒక్క చుక్క కాళేశ్వరం నీళ్లు లేకుండా 1కోటి 53లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండింది. పదేళ్లలో కేసీఆర్ ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 23 వేల కోట్లు ఖర్చు చేశారు. ఏ ప్రాజెక్టునైనా పూర్తిచేశారా? ప్రజలకు నీళ్లు ఇచ్చామని చెప్పగలరా?. రంగనాయక్ సాగర్ కోసం సేకరించిన భూముల్లో హరీశ్ రావు ఫామ్ హౌస్ కట్టుకున్నారు. అన్నీ లెక్కలు తీస్తాం.. అన్నీ బయటకు తీస్తాం. కొండపోచమ్మ సాగర్ కట్టింది కేసీఆర్ ఫామ్ హౌస్‌కు నీళ్లు తీసుకెళ్లేందుకే

**బామ్మర్ది డ్రగ్స్ తీసుకున్నా పట్టుకోవద్దట**

బావ కళ్లల్లో ఆనందం చూడటానికి బామ్మర్ది డ్రగ్స్ తీసుకున్నా పట్టుకోవద్దట. పేదలకు ఒక చట్టం నీకో చట్టమా?. ముఖ్యమంత్రిగా నా నియోజకవర్గ ప్రజలకు నీళ్లు ఇచ్చేందుకు నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేద్దామంటే కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు. పరిశ్రమలు తెస్తే మా ప్రాంతానికి ఉద్యోగాలు వస్తాయని అనుకుంటూ భూసేకరణ జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు..




### కొడంగల్ అంటే ఎందుకింత కక్ష

కొంత మంది రౌడీ మూకలను తయారు చేసి అధికారులపై దాడి చేశారు. పైగా కేసులు పెట్టారని అంటున్నారు. నీ కొడుకు, నీ అల్లుడు భాషను మీరు సమర్థిస్తారా కేసీఆర్. తెలంగాణలో పరిశ్రమలు పెట్టొద్దా.. మా పిల్లలకు ఉద్యోగాలు రావొద్దా?. పదేళ్లు పాలించిన మీరు భూసేకరణ చేయలేదా ?. కొండమ్మ పోచమ్మ సాగర్‌లో భూములు గుంజుకున్న చరిత్ర మీది. కొడంగల్‌లో భూసేకరణ చేస్తే మీకు కడుపుమంట దేనికి ?. కొడంగల్ అంటే మీకు ఎందుకు ఇంత కక్ష. అభివృద్ధి జరగాలంటే భూసేకరణ జరగాల్సిందే. భూములు కోల్పోయి బాధలో ఉన్నవారిని మా ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుంది. పరిహారం పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేటీఆర్ ఢిల్లీ కాదు చంద్ర మండలం పోయి ఫిర్యాదు చేసుకున్నా సరే చేసిన కుట్రకు నువ్వు ఊచలు లెక్కబెట్టాల్సిందే. ఉరుకు ఎంతదూరమో ఉరుకుతవో చూస్తున్నా. చివరగా కేసీఆర్‌కు ఒక్క మాట చెబుతున్నా.. అసెంబ్లీకి రా సామి.. ఒక్కసారి రా'' అని సీఎం రేవంత్ అన్నారు. కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేష్ పాల్గొన్నారు.

# రాజన్న క్షేత్రానికి రేవంత్ వరాలు

## పూర్ణకుంభంతో సీఎంకు ఘనస్వాగతం

### ధ్వజస్థంభం వద్ద కోడె మొక్కులు.. రూ.694.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### సీఎంతో పాటు కార్యక్రమంలో మంత్రులు .. ఉత్తమ్, పొన్నం, కొండా సురేఖ

**వేములవాడ, మహా:** రాజన్న సిరిసిల్ల జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా ఆయన వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చారు. ముందుగా హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా వేములవాడకు చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసిన సీఎంకు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి ముందుగా ప్రధాన ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీ రాజరాజేశ్వర స్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గణపతి, రాజరాజేశ్వరి అమ్మవార్లను దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద కోడె మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులకు ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం స్థల పురాణాన్ని పురోహితులు వివరించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి పనుల వివరాలను అధికారులు వివరించారు.



**రూ. 694.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు**

ప్రజాపాలన తొలి ఏడాదిలోనే మొత్తం రూ.694.50 కోట్లతో వేములవాడలో వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. 76 కోట్ల రూపాయలతో చేపట్టే శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.35.25 కోట్లతో చేపట్టే అన్నదానం సత్రం నిర్మాణ పనులు, రూ. 45 కోట్లతో చేపట్టే మూల వాగు బ్రిడ్జి నుంచి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. 166 కోట్ల రూపాయలతో చేపట్టే వైద్య కళాశాల, హాస్టల్ బ్లాక్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. రూ.50 కోట్లతో నూలు డిపో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.52 కోట్లతో కోనరావుపేట మండలంలో చేపట్టే హై లెవెల్ బ్రిడ్జి పనులు, రూ. 3 కోట్లతో నిర్మించే డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.235 కోట్లతో 4వేల 696 మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల పనులకు భూమి పూజ చేశారు. మేడిపల్లి మండలంలో జూనియర్ కళాశాల రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. సిరిసిల్లలో రూ. 26 కోట్లతో నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనం, వేములవాడలో కోటి 45 లక్షల రూపాయలతో నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని, రూ. 4 కోట్ల 80 లక్షలతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. సీఎంతో పాటు కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.








ఈరోజు వేములవాడ రాజన్న ఆలయ సన్నిధికి మరియు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమలకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ గారితో ముచ్చటిస్తున్న టి పి సి సి జనరల్ సెక్రటరీ కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేష్ గారు అనంతరం ఆయన ముఖ్యమంత్రి గారికి శాలువా కప్పి సత్కరించారు...

# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సీరియస్‌గా అమలు చేయండి

## రీసెర్చ్ యూనిట్ ద్వారా అమలుపై అధ్యయనం చేయండి.. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, మహా:** ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సీరియస్ గా తీసుకొని అమలు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధులపై 32 శాఖల పని తీరుపై సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించి శాఖల వారిగా కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు, గత ఏడాది ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ , ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం అన్ని శాఖల్లో ఒక విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని, అమలుకు సపోర్ట్ యూనిట్ ఇప్పటికే ఉంటే ఇబ్బంది లేదని, ఒక వేళ లేకపోతే సపోర్ట్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అన్ని శాఖల్లో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు అవుతున్నది లేనిది ఇక నుంచి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యవేక్షిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. సబ్ ప్లాన్ చట్టం అమలుపై సెస్ ఇప్పటి వరకు సమర్పించిన నివేదికలు అధ్యయనం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా రిసర్చ్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక పథకాల రూపకల్పన చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల ఖర్చుపై అన్ని శాఖలు 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. గిరిజన తండాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా కావాలన్న డిమాండ్ ఉన్న నేపథ్యంలో అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు మంచి పథకాలను సిద్ధం చేసుకుని ఆర్థిక శాఖకు నివేదిక సమర్పించాలన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే వచ్చిందన్నారు. ఈ పథకం అమలుపై ప్రజా ప్రభుత్వం స్పష్టంగా ఉందని, గత ప్రభుత్వ చర్యల మూలంగా పదేళ్లపాటు అర్హులైన వారు లబ్ధి పొందలేకపోయారన్నారు. మీ ద్వారా ఆ వర్గాలకు చేయూతను ఇవ్వాలని అధికారులను డిప్యూటీ సీఎం కోరారు. స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైనాన్స్ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్టీ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్సీ వెల్ఫేర్ శ్రీధర్, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, సిడిఎమ్ఏ కమిషనర్ శ్రీదేవి, ఆర్టీసీ ఎండి సజ్జనార్ పాల్గొన్నారు




# నిర్లక్ష్యమా... నిర్వేదమా?

## రాజాసింగ్ నిర్ణయంపై బీజేపీలో జోరుగా చర్చ

### గ్రేటర్ లో ఒకే ఒక ఎమ్మెల్యే.. పిలవని పార్టీ.... పట్టించుకోని ఎమ్మెల్యే

### పార్టీ వేటు వేలసిన నాటి నుంచి అదే తీరు

### ఇటీవల పార్టీ యాక్టివిటీ జాబితాలో రాజాసింగ్ పేరు

### తాజాగా మూసీ పరివాహక ప్రాంతాల పర్యటనలో గాయబ్

### ఎక్కడా కనిపించకపోవడమే కారణమా ?



**హైదరాబాద్, మహా :** గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్..., బీజేపీ స్టేట్ ఆఫీస్ కు అత్యంత దగ్గరగా ఉన్న.. ఏకైక ఎమ్మెల్యే. అంతేకాకుండా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కూడా ఆయనే. అలాంటి వ్యక్తి పార్టీ పట్ల విరక్తి చూపడం, పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండటం గత ఖొంత కాలంగా ఛర్చ నీయాంశంగా మారింది. పార్టీని రాజాసింగ్ లైట్ తీసుకున్నారా? లేక పార్టీయే రాజాసింగ్ ను ఖావాలని పక్కకు పెట్టిందా ? అనేది గత కొంత కాలంగా చర్చనీయాంశంగా మారింది. స్టేట్ ఆఫీస్ కు అతి సమీపంలో రాజాసింగ్ ఉన్నా పార్టీ కార్యక్రమాల్లో అందనంత దూరంలో ఉన్నారు. గతంలో హైదరాబాద్‌లో మునావర్ ఫారూక్ షో ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఓ వర్గాన్ని వ్యతిరేకిస్తూ రాజాసింగ్ ఘాటు విమర్శలు చేశారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న దేశాల నుంచి అభ్యంతరాలు రావడంతో పార్టీ ఆయనపై వేటు వేసింది. పార్టీలో అందరికీ ఒకే రూల్ అని.. రాజాసింగ్ పార్టీ లైన్ దాటారని సస్పెండ్ ఎందుకు చేయవద్దో చెప్పాలని బీజేపీ హైకమాండ్ నోటీసులు సైతం జారీచేసింది. పార్టీ వేటు వేసిన నాటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో ఆయన తీరు మారినట్లుగా కనిపిస్తోంది. దాదాపు 14 నెలలు సస్పెన్షన్ వేటును ఎదుర్కొన్న రాజాసింగ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధిష్టానం సస్పెన్షన్ ను ఎత్తేసింది. అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు సస్పెన్షన్ ను పార్టీ ఎత్తేసింది. అయినప్పటికీ ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాజాసింగ్ దాదాపు ఒంటరి పోరాటం చేశారు. అయితే ప్రజల్లో ఉన్న ఆధరణ, ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాట ఫలితమే ఆయనకు విజయం చేకూర్చి పెట్టింది. గెలుపు తర్వాత కూడా రాజాసింగ్ ను పార్టీ పట్టించుకోకపోవడం, పార్టీని రాజాసింగ్ కేర్ చేయకపోవడం కొనసాగుతూ వస్తోంది. ఎన్నికల అనంతరం ఆయన్నే యథావిధిగా బీజేఎల్పీ నేతగా కొనసాగిస్తారని ఆయన భావించారు. కానీ ఆయనను కాదని పార్టీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని శాసన సభ పక్ష నేతగా ప్రకటించింది. అప్పటి వరకు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మాట అటుంచితే కనీసం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన దాఖలాలు కూడా లేకపోవడం గమనార్హం. దీంతో ఆయన బీజేపీని లైట్ తీసుకున్నారా? అనే ప్రశ్నలు శ్రేణుల్లో ఉత్పన్నమయ్యాయి. తాజాగా నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా పని చేసిన ఒక నేతను కనీస సమాచారం ఇవ్వకుండా పార్టీలో చేర్చుకోవడంతో కలత చెందిన రాజాసింగ్ రాజకీయ సన్యాసం ప్రకటన చేశారన్న ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యకలాపాల పట్ల అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తుండటం వల్లే చేరికకు సంబంధించిన సమాచారం రాజాసింగ్ కు చెప్పలేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే గ్రేటర్ ఫరిధిలో పార్టీ చుక్కానిలా ఉన్న రాజాసింగ్ పట్ల రాష్ట్ర నాయకత్వం వ్యవహరిస్తున్న తీరును కొంత మంది శ్రేణులు, ధర్మ పరిరక్షకులు తప్పుపడుతున్నారు. రాజాసింగ్ కు ప్రజల్లో ఉన్న ఆధరణను చూసైనా రాష్ట్ర నాయకత్వం ఆయనకు ప్రాదాన్యం ఇన్నాల్సిన్ అవసరం ఉందని, ప్రజాధరణ కలిగిన ఒక్క నేతను కూడా పార్టీకి దూరం చేయడం సరైంది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర నాయకుల ఏక పక్ష నిర్ణయాలపై విసిగిపోయే రాజాసింగ్ రాజకీయాలకు దూరంగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చారన్న చర్చ బీజేపీలో తీవ్రమైంది. ఇదిలా ఉండగా గతంలో జరిగిన పార్టీ కార్యక్రమాల్లో భాగంగా దాదాపు అన్ని సందర్భాల్లో రాజాసింగ్ పేరును జాబితాలో ప్రకటించిందిరాష్ట్ర నాయకత్వం. కానీ తాజాగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ చేపట్టిన బస్తీ నిద్ర కార్యక్రమానికి మాత్రం ఆయన పేరు లిస్టులో లేకపోవడం గమనార్హం. గతంలో తరచూ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్రకు వెళ్లే రాజాసింగ్ ను అక్కడ ప్రచారానికి వెళ్లే టీ బీజేపీ నేతల జాబితాలో కూడా పార్టీ ఆయన పేరును పెట్టకపోవడం చూస్తుంటే జాతయ నాయకత్వమే ఆయనను కావాలని పక్కు పెట్టిందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పార్టీలో గత ఖొత కాలంగా జరుగుతున్న పరిణామాలను పరిశీలించిన రాజాసింగ్ చివరకు ధర్మపరిక్షణే ప్రధానమని భావించినట్లు స్పష్టమవుతోంది.

# హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాలకు చెక్

## ఎలివేటెడ్ కారిడార్లకు ప్రాథమిక నోటిఫికేషన్

### నాలుగు నెలల్లో ప్రారంభం కానున్న పనులు

### డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను క్రమక్రమంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నేషనల్ హైవే 44పై 5.320 కిలోమీటర్ల కారిడార్‌ను రూ.1,580 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫామ్ రోడ్డు వరకు 5.32 కిలోమీటర్ల డబుల్డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, జేబీఎస్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ కు కలుపుతూ (18.1 కిలోమీటర్ల) మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు.

ఈ కారిడార్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. కారిడార్ల నిర్మాణాలకు రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ మార్గాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులతోపాటు సర్కార్ భూముల వివరాలను గుర్తించేందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేశారు. భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని డిప్యూటీ కలెక్టర్లు, స్థానిక ఎమ్మార్వోలకు సూచించారు. భూసేకరణ పనులను నిర్ణీత గడువులోనే పూర్తి చేయాలన్నారు. 100 రోజుల్లోపు ప్రాథమిక నోటిఫికేషన్, డిక్లరేషన్ల ప్రక్రియలు పూర్తవ్వాలని చెప్పారు. మరో మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్చి చేయాలని.. ఆ తర్వాత నెల కారిడార్ల పనులను మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇక కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం భూములు సేకరించిన తర్వాత మిగిలిన భూములు కబ్జా కాకుండా ప్రహరీలు నిర్మించాలని హెచ్ఎండీఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కంటోన్మెంట్ పరిధిలో మొత్తం 113.48 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఎంత భూమిని సేకరిస్తే అంతే మొత్తంలో భూములను ఇతర ప్రాంతాల్లో కంటోన్మెంట్‌కు ఇవ్వడానికి హెచ్ఎండీఏ ఇప్పటికే అంగీకరించింది. ప్రాజెక్టుల కోసం సేకరించిన డిఫెన్స్ భూములు మినహా, మిగిలిన భూములకు ప్రహరీ నిర్మించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైంది. దాదాపు రూ. 27 కోట్లతో ప్రహరీలు నిర్మించడానికి తాజాగా టెండర్లను ఆహ్వానించింది. ఈ ఫెన్సింగ్ నిర్మాణాలను నాలుగు రీచ్ లుగా విభజించి పనులు చేపట్టనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోయే ఛాన్స్ ఉంది. నేషనల్ హైవే-44 రహదారిలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ రూట్లలో వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. అలాగే జేబీఎస్-శామీర్ పేట వరకూ నిర్మించే కారిడార్లో తిరుమలగిరి, అల్వాల్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది.

04
మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | గురువారం, హైదరాబాద్ | 21-11-2024
ANN తెలుగు



**అన్ని రంగాల్లో అస్తిత్వాన్ని చాటుకుని, అభ్యున్నతి సాధించేలా దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన సమాజాల కోసం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి సాగిన వ్యవస్థాగత నిర్లక్ష్యం అనంతరం కొత్త వెలుగు ప్రసరిస్తోంది. అంతరాలను పూడ్చడమే కాకుండా ఘనమైన వారి వారసత్వం, గిరియువత సాధికారత, ఆరోగ్య సదుపాయాలను మెరుగు పరచడం, ఆర్థిక అవకాశాల కల్పనపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సుదీర్ఘ కాలంగా విస్మృతులుగా మిగిలిపోయిన ఆ సమూహాలకు ప్రతిష్ఠాత్మకమైన చర్యలతో పురోగతి, అభ్యున్నతి, సమానావకాశాలను కల్పించడం ద్వారా గిరిజన పౌరులతో తన సంబంధాలను భారత్ పునరుద్ధరించుకుంటోంది. మరింత ఉజ్వలమైన, సమ్మిళిత భవిష్యత్తు దిశగా చరిత్రలో నిలిచేపోయే విధంగా చేపట్టిన 'మొదటి' కార్యక్రమాలను ఒక సారి పరిశీలిద్దాం.**



# భారతీయ గిరిజన సమాజాల్లో అభివృద్ధి వెలుగులు









### గిరిజన ప్రాంతాలకు 100% చేరువయ్యే లక్ష్యం

జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా తొలిసారిగా గిరిజన వర్గాల సామాజికఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. 63 వేల గ్రామాలు దీని పరిధిలోకి వస్తాయి. 5 కోట్ల మంది గిరిజన ప్రజలకు 100% ప్రయోజనాలు చేకూర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 80 వేల కోట్ల బడ్జెట్ తో చేపట్టిన ఈ కార్యక్రమం దేశంలోని గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, సాధికారత లక్ష్యంగా పెట్టుకుంది.

### గిరిజన సాధికారత సాధనంగా ఎంఎస్పీ

తొలిసారిగా.. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) వ్యవస్థ గిరిజన వర్గాలకు సాధికారిక సాధనంగా మారింది. కనీస మద్దతు ధర పొందే చిన్న అటవీ ఉత్పత్తుల సంఖ్యను 12 నుంచి 87కు పెంచడం గిరిజన వర్గాలకు స్థిరమైన ఆదాయ అవకాశాలను అందించడంతోపాటు వనరుల వినియోగంలో సుస్థిరతను ప్రోత్సహిస్తుంది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న గుర్తింపు, వనరులు, అవకాశాలను తొలిసారిగా అందించడం ద్వారా మన గిరిజన సోదరీ సోదరుల జీవనాల్లో శాశ్వతమైన మార్పును తెస్తోంది. దశాబ్దాల నిర్లక్ష్యం అనంతరం.. భారతదేశ అభివృద్ధిలో సాధికారత, పునరుజ్జీవనంలో వారిప్పుడు ముందువరుసలో నిలిచారు. తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకోవడానికి సంసిద్ధులయ్యారు.

### గిరిజన విద్యలో విప్లవాత్మక మార్పులు

గిరిజన విద్యార్థులు ఎట్టకేలకు తగిన విద్యావకాశాలను పొందుతున్నారు. పాఠశాలల్లో నమోదైన వారి సంఖ్య 201314లో 34,000 ఉండగా, 202324 నాటికి అది 1.3 లక్షలకు పెరిగింది. ఏకలవ్య ఆదర్శ ఆవాస పాఠశాలలు (ఈఎంఆర్ఎస్) పెరగడం ఈ మార్పునకు మూల కారణం. దశాబ్ద కాలంలోనే వాటి సంఖ్య నాలుగు రెట్లు పెరిగి 123 నుంచి 476 కు చేరింది. కేవలం విద్యను అందించడం మాత్రమే కాకుండా.. ఈ పాఠశాలలు దేశవ్యాప్తంగా గిరిజన యువత జీవితాలను మార్చివేస్తున్నాయి.

### రక్తహీనతను అరికట్టడానికి తొలిసారిగా దేశవ్యాప్త కార్యక్రమం

సికిల్ సెల్ రక్తహీనతను అరికట్టడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం గిరిజన సమాజం ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను విశేషంగా పరిష్కరిస్తోంది. ఇప్పటికే 4.6 కోట్ల మందిని ఇందులో భాగంగా పరీక్షించారు. మూడేళ్లలో 7 కోట్ల మందిని చేరుకోవాలని లక్ష్యంగా నిర్ణయించారు. రక్తహీనతను అరికట్టే ఈ కార్యక్రమం కేవలం ఆరోగ్యానికి సంబంధించినది మాత్రమే కాదు. భారతీయ గిరిజనులకు భరోసాతో కూడిన ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం దీని లక్ష్యం.

### ఉపకార వేతనాల పునరుద్ధరణ

తొలిసారిగా గిరిజన విద్యార్థులకు విస్తృతంగా ఉపకార వేతనాలు అందుతున్నాయి. వీటి ద్వారా ఏటా 30 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. గత పదేళ్లలో మొత్తం రూ. 17,000 కోట్లు పంపిణీ చేశారు. ఈ ఉపకార వేతనాలు కేవలం ఆర్థిక చేయూత మాత్రమే కాదు గిరిజన యువత సాధికారతకు అవి బాటలు పరుస్తున్నాయి. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల కృషికి ఇప్పుడు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. వారి గౌరవార్థం 10 ప్రదర్శన శాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భగవాన్ బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ్ దివస్ గా ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఆయనకు నివాళి. భారతీయ గిరిజనుల పునరుజ్జీవనానికి నిదర్శనం. మొదటిసారిగా, గిరిజన యోధుల గాథలను సగౌరవంగా కీర్తిస్తూ వారి సాంస్కృతిక వారసత్వాన్ని ప్రభుత్వం పరిరక్షిస్తోంది.

### వన్ ధన్ కేంద్రాల ద్వారా స్వావలంబన

గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం 3900 వన్ ధన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు కీలకమైన మైలురాయి. వీటి ద్వారా దాదాపు 12 లక్షల మంది గిరిజన పారిశ్రామికవేత్తలకు అవసరమైన వనరులను సమకూరుస్తున్నారు. సంప్రదాయక నైపుణ్యాలను లాభసాటి అవకాశాలుగా మార్చుకోవడానికీ.. ఆర్థిక స్వావలంబనకు, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఈ కేంద్రాలు గిరిజనులకు వీలు కల్పిస్తున్నాయి.

### భారత తొలి గిరిజన రాష్ట్రపతి ప్రాతినిధ్యంలో చరిత్రాత్మక మైలురాయి


భారతదేశపు తొలి గిరిజన రాష్ట్రపతిగా శ్రీమతి ద్రౌపది ముర్ము ఎన్నిక గిరిజన ప్రాతినిధ్యంలో ఒక ప్రతిష్ఠాత్మకమైన ముందడుగు. ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిలో సమ్మిళితత్వంతో పాటు.. అవరోధాలు తొలగిపోతున్నాయన్న శక్తిమంతమైన సందేశాన్ని అది అందిస్తోంది. ఆమె రాష్ట్రపతి పదవి దేశంలోని లక్షలాది మంది గిరిజనుల ఆశలు, అవకాశాలకు చిహ్నంగా నిలుస్తుంది.

### మారుమూల గిరిజన ప్రాంతాలకు ప్రాథమిక సదుపాయాల కల్పన

పీఎంజన్ మన్ ద్వారా గృహనిర్మాణం, శుద్ధమైన నీరు, పారిశుధ్యం, ఆరోగ్య రక్షణ వంటి అత్యవసర సేవలు మొదటిసారిగా అత్యంత బలహీనమైన గిరిజన సమూహాలకు చేరుతున్నాయి. 75 అత్యంత దుర్బల గిరిజన సమూహాలు (పీవీటీజీ), 45 లక్షలకు పైగా కుటుంబాలకు రూ. 24,000 కోట్లకు పైగా బడ్జెట్ తో కేటాయింపులు చేశారు. ఈ కార్యక్రమం మారుమూల గిరిజన సమాజాలకు జీవనాధారం.

### జమ్మూ, కశ్మీర్ గిరిజనులకు అవకాశాలు

ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్ లో షెడ్యూల్డ్ తెగలకు విద్య, ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పరుస్తూ ఈ ప్రాంతంలోని గిరిజన సమాజాల్లో సమ్మిళిత్వాన్ని ఇది పెంపొందిస్తుంది.



### 5.7 రేట్లు పెరిగిన నిధులు

గిరిజనుల సంక్షేమం కోసం ఆర్థిక కేటాయింపులు మొదటిసారి రికార్డు స్థాయికి చేరాయి. ఎస్టీల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక నిధులు 2013-14లో రూ. 24,600 కోట్ల నుంచి 2024-25 నాటికి దాదాపు అయిదు రెట్లు పెరిగి రూ.1.23 లక్షల కోట్లకు చేరాయి. ఇది విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహనిర్మాణం వంటి ఎన్నో కార్యక్రమాలను వేగవంతం చేస్తోంది. గిరిజన సమాజాల సాధికారత పట్ల బలమైన నిబద్ధతకు ఇది నిదర్శనం.

### కొత్త ఆదాయ వనరులు

తొలిసారిగా వెదురును చెట్లను జాబితా నుంచి తొలగించడం ద్వారా స్వేచ్ఛగా దానిని కోసుకోవడానికి గిరిజనులకు అవకాశం లభించింది. ఈ మార్పు గిరిజన కుటుంబాలకు సరికొత్త ఆదాయ వనరుగా మారడంతో పాటు సుస్థిరమైన అవకాశాలను కల్పిస్తూ, 'ఆకుపచ్చ బంగారం'గా వెదురు గిరిజనుల అభ్యున్నతికి తోడ్పడుతోంది.





# ఆడ తోడు కోసం..

## టైగర్ జానీ ప్రేమయాత్ర..!.. నెల రోజులుగా అలుపెరుగని నడక
## మహారాష్ట్ర నుంచి తెలంగాణకు 340 కి.మీ ప్రయాణం



ఆ పులి పట్టుదల చూస్తే షాకవుతారు. ఆడ తోడు కోసం తహతహలాడుతున్న ఓ మగ పులి మహారాష్ట్ర నుంచి తెలంగాణ బాట పట్టింది. తన తోడును వెతుక్కుంటూ దాదాపు 340 కి.మీ ప్రయాణం చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతంలోని ఆసిఫాబాద్ జిల్లా స్థానికుల్లో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పెద్ద పులి మహారాష్ట్రలోని కిన్వాట్ అడవుల నుంచి వచ్చినట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఆడ తోడు కోసం అది ఆసిఫాబాద్ చేరుకోగా.. మరో 20 కి.మీ దూరంలో దాని తోడు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**తోడు దరికి..**

ప్రేమ, విరహం మనుషులకే కాదు జంతువులకూ ఉంటుంది. అందుకు సరైన ఉదాహరణ టైగర్ జానీ అనే పెద్ద పులి. ఆడ తోడు కోసం ఈ టైగర్ అలుపెరుగని ప్రయాణం చేస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నెల రోజులుగా నడక సాగిస్తూనే ఉంది. ఇప్పటికే 340 కి.మీ దాటిన ప్రేమయాత్ర ఇంకా సాగుతూనే ఉంది. మహారాష్ట్ర అడవుల నుంచి కొండలు, గుట్టలు దాటి తెలంగాణ కవ్వాల్ అభయారణ్యంలోకి చేరుకుంది. నిర్మల్ జిల్లా సమీపంలోని మహబూబా ఘాట్ వద్ద ఈనెల 11న ఓ పులి రోడ్డు దాటుతూ వాహనదారుల కంట పడిన విషయం తెలిసిందే. ఆ పులి టైగర్ జానీ అనే మగ పులిగా గుర్తించారు. 68 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న టైగర్ జానీ.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వాట్ తాలూకా అడవుల నుంచి ఆదిలాబాద్ అడువుల బాట పట్టింది. కిన్వాట్, భైంసా, కుంటాల, సారంగాపూర్, ఇచ్చోడ మీదుగా ప్రస్తుతం ఉట్నూరుకు చేరుకుందు. దాదాపు 340 కి.మీ ఈ పులి సంచారం చేసింది. అయితే ఆ పులి తెలంగాణకు రావటానికి ప్రధాన కారణం ఆడ తోడుగా అటవీ అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. ఆడ తోడు కోసం టైగర్ జానీ తన ప్రయాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మగ పులులు చలికాలంలో తరచుగా ఇటువంటి సుదీర్ఘ ప్రయాణాలను ప్రారంభిస్తాన్నారు. ఇది వాటికి సంభోగ కాలమని.. పులులు అవి ఉన్న ఏరియాలో సరైన జత దొరకపుడు సహచర ఆడ పులిని వెతుకుతూ ఇలా సుదీర్ఘ ప్రయాణాలు చేస్తాయని చెప్పారు. అక్టోబర్ మూడో వారంలో టైగర్ జానీ తన ప్రయాణాన్ని ప్రారంభించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముందుగా ఇది ఆదిలాబాద్ బోథ్ మండల అడవుల్లో కనిపించిందని.. ఆ తర్వాత.. నిర్మల్ జిల్లా కుంటాల, సారంగాపూర్, మామడ, పెంబి మండలాల మీదుగా ఉట్నూర్‌లోకి ప్రవేశించిందన్నారు. హైదరాబాద్‌నాగ్‌పూర్ నేషనల్ హైవే44 దాటుకుని తిర్యాణి ప్రాంతం వైపు వెళ్లినట్లు చెప్పారు.

**వంద కిమీ దూరం నుండి పసిగట్టే పులులు**

ఆడ పులులు విడుదల చేసే ప్రత్యేక సువాసనను.. మగ పులులు 100 కి.మీల దూరం నుంచి పసిగడతాయని చెప్పారు. అలా అవి ఆడ తోడును వెతుక్కుంటూ ఎంత దూరమైనా ప్రయాణం చేస్తాయని అటవీ అధికారి బాజీరావు మహా పత్రికకు వెల్లడించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌కెరమెరి అడవుల్లో ఒంటరిగా ఉన్న ఆడ పులికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలోనే టైగర్ జానీ ఉందని అన్నారు. ఆడ పులి మూత్రం నుంచి వచ్చే సువాసనను అనుసరిస్తూ.. టైగర్ జానీ తన ప్రయాణాన్ని సాగిస్తుందని చెప్పారు. త్వరలోనే ఆడ పులిని కలిసి అది సంభోగిస్తుందన్నారు. అయితే ఈ సంభోగం ఆడ, మగ పులి మధ్య పరస్పర అంగీకారం, దట్టమైన వృక్ష సంపదతో కూడిన తగిన అటవీ ప్రాంతం సహా అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. పులులు తమ ఆడ తోడు కోసం వెతకడం వల్ల మనుషులకు ముప్పు ఉండదని చెప్పారు. పులి విషయంలో భయాందోళనలు అవసరం లేదని అన్నారు. ప్రస్తుతం అది కవాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌కు చేరుకుంటుందని.. అది అక్కడే ఉండిపోతే ఫారెస్ట్‌లో పులుల సంఖ్య పెరగటంతో పాటుగా జీవ వైవిధ్యం ఏర్పడుతుందని చెప్పారు. టైగర్ జానీ కదలికలు పసిగట్టేందుకు ట్రాప్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. టైగర్ జానీ మూలాలను కనుగొనేందుకు మహారాష్ట్ర అటవీ అధికారులను ఆదిలాబాద్ అటవీ అధికారులు సంప్రదిస్తున్నారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా: editor@mahaadaily.com | whatsapp- 7436939999

## దిశా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించిన మందకృష్ణ మాదిగ



**ఖమ్మం సిటీ, నవంబర్ 20, మహా:** వికలాంగుల హక్కుల పోరాట సమితి చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలపడానికి వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దిశా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను సందర్శించి ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించి వారి మన్నలను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతి రణదేవ్, మేనేజ్మెంట్ మేకర్ సుగుణారావు (న్యాయవాది) ఆయనను ఘనంగా శాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుండె పాక నరసయ్య, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మంద దేవేంద్ర ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, తూరుగంటి అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వరరావు, నూకల నాగేశ్వరరావు, గోవింద నాగేశ్వరరావు, సామిన బోయిన రమేష్, రాకేష్, అనిల్ దిశా హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్లో ఘనంగా సైన్స్ డే




**మణుగూరు, నవంబర్ 20, మహా:** మున్సిపాలిటీలోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్ లో బుధవారం సైన్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ డేను నిర్వహించామన్నారు. విద్యార్థులకు ప్రత్యేక టాస్క్ ద్వారా వారిలో జ్ఞాపకశక్తిని మెరుగుపరిచేందుకు సైన్స్ డే ని నిర్వహించి తల్లిదండ్రులను వారితో కలిసి పనిచేసే విధంగా కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారి ఆలోచన ధోరణి మారుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నీటి ద్వారా విద్యుత్ ను వెలికితీయడం, వ్యర్థమైన నీటిని ఫిల్టర్ చేయడం, భూమి అంతర్భాగంలో ఉన్న వేడి బయటకి వచ్చే లావా ప్రక్రియ, వ్యర్థమైన పదార్థాలను మిషన్ ద్వారా తీసుకుని ఊరికి దూరంగా వదిలి వేయడం వంటి అంశాలపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా కన్నీళ్ల పండుగ వేడుకలు



**అశ్వారావుపేట, నవంబర్ 20, మహా:** అశ్వారావుపేట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం కన్నీళ్లు పండగ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామికి పాలు, తేనె, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తుల ఆరాధనకు నిండైన భావ ప్రాధాన్యతతో కన్నీళ్లు పండగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు రాఘవ శర్మతో పాటు అయ్యప్ప మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ



**ముదిగొండ, నవంబర్ 20, మహా:** మండల కేంద్రమైన ముదిగొండ తహశీల్దార్ కార్యాలయాన్ని ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) గరిడి నరసింహారావు బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సునీతతో ఆయన మాట్లాడి సర్వే వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కుటుంబ సమగ్ర సర్వేను పూర్తిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ గులాబ్ సింగ్, తహశీల్దార్ కె. సునీత ఎలిజిబెత్, ఎంఈఓ డి రమణయ్య, ఆర్ఐలు ఎస్కే వహీదాసుల్తానా, ప్రసన్నకుమార్, ఏఎస్ఓ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# లక్నవరం సరస్సులో మరో కలికితురాయి చేరింది

### మూడో ద్వీపం అందుబాటులోకి వచ్చింది.. పర్యాటకులకు స్వర్గధామం..

### రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం.. మంత్రులు జూపల్లి, సీతక్క





**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ములుగు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణరావు అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామం లక్నవరం జలాశయంలో రూ. 7 కోట్ల వ్యయంతో 3 ఎకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీ కోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని (ఐలాండ్), మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ములుగు జిల్లాలో రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండటంతోపాటు దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క సారలమ్మ జాతర ఇక్కడి జిల్లాకు గుర్తింపు తెచ్చి పెడుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులకు పెద్దపేట వేస్తున్నామని పేర్కొన్నారు. ఐలాండ్ అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుదూర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తెలంగాణలో కూడా ఇలాంటి ఓ అందమైన టూరిజం స్పాట్ ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన మాల్దీవులు, శిమ్లా, మున్నార్ వంటి ప్రాంతాలను తలపించేలా ఈ ద్వీపాన్ని సుందరీకరించారని చెప్పారు. చూసినంత దూరం నీరు, చుట్టూ పచ్చని కొండలు మధ్యలో 12 దీవులతో ప్రకృతి అందాలను కలబోసుకున్న లక్నవరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ... జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చొరవ చూపుతున్నారని, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరీష్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు 12వేల రూపాయల

## జీవన భృతి ఇవ్వాలి

### అమర్లపూడి రాము

**అశ్వారావుపేట/దమ్మపేట, నవంబర్ 20, మహా:** అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం దమ్మపేట మండలం జమేధారుబంజర్, గురవాయిగూడెం గ్రామాల్లో కరపత్రాలు ఆవిష్కరించి, జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, నూపా భాస్కర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 12,000 జీవన భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ. 15,000 రైతు భరోసా వంటి వాగ్ధానాలు నెరవేర్చలేదని విమర్శించారు. జీవన భృతి లేకపోవడంతో వ్యవసాయ కార్మికులు వలస వెళ్లి దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవన భృతి అమలు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కురసం ముత్యాలరావు, తమా రాముడు, పందూరి వీరబాబు, ఊకె మహేష్, కుంజా కాంతారావు పాల్గొన్నారు.

## యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం ప్రారంభం



**ఖమ్మం సిటీ, నవంబర్ 20, మహా:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్, జనరేటివ్ ఏఐలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయని, వాటిపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమని ఎస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ జి. కృష్ణ తెలిపారు. బుధవారం ఐ.సి.టి. అకాడమీ మరియు హానీవెల్ సంయుక్తంగా నిర్వహించే 15 రోజుల యూత్ ఎంపవర్మెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ, ప్రపంచ పోకడలకు అనుగుణంగా విద్యార్థులు ఆధునిక కోర్సులపై పట్టు సంపాధించాలని వారిని కోరారు. తమిళనాడుకు చెందిన ఐ.సి.టి. అకాడమీ మరియు హానీవెల్ సంస్థ ఆధ్వర్యంలో తమ విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై రాసున్న 15 రోజుల పాటు శిక్షణను ఇప్పిస్తామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. యూత్ ఎంపవర్మెంట్ లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, చేయబడిన విద్యార్థులకు ఉచిత శిక్షణను ఇప్పించనున్నట్లు వారు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.టి. అకాడమీ స్టేట్ హెడ్ గోపాల్, రిలేషన్ షిప్ మేనేజర్ షేక్ గౌస్ పాషా, ప్రాజెక్ట్ కోఆర్డినేట్ బి. దిలీప్ తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డా. ఎ.వి.వి. శివ ప్రసాద్, గుండాల ప్రవీణ్ కుమార్, డా. జె. రవీంద్రబాబు, డా. ఎస్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. ఎన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 3 లోగా దరఖాస్తులు

## సమర్పించాలి

### జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ

**ఖమ్మం, నవంబర్ 20, మహా:** జనవరి, 2025లో జరగనున్న డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ (టిసిసి) లోయర్, హయ్యర్ పరీక్షలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 3లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని పరీక్షా రుసుం చెల్లించాలని జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ లో సమర్పించాలని, 50 రూపాయల అపరాద రుసుముతో డిసెంబర్ 10 లోగా, 75 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబర్ 17 లోగా దరఖాస్తు సమర్పించి, దరఖాస్తు కాపి, విద్యార్హత సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారితో ధృవీకరించి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, ఇతర పూర్తి వివరాలను www.bse.telangana.gov.in వెబ్ సైట్ నందు పొందాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు..




**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎన్. గోపాల్ రావు సూచించారు. బుధవారం డీఎంహెచ్వో ములుగు జిల్లా ఆసుపత్రిలోని పాల్లేటివ్, సైకయాట్రిస్ట్, అసంక్రమిక వ్యాధుల క్లినిక్, రేడియాలజీ హబ్, టీ హబ్లను సందర్శించారు. అనంతరం ములుగు మండలం జంగాలపల్లిలో మూడో రోజు నిర్వహించిన వైద్యశిబిరంను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో గోపాల్ రావు మాట్లాడుతూ.. సిబ్బంది మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని, రోగులను ఆప్యాయతతో పలకరిస్తూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. వార్డులలోని రికార్డులను పరిశీలించి సమయానికి రిపోర్ట్స్ అందించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఉంటే శిబిరానికి వచ్చి పరీక్షించుకోవాలన్నారు. మూడవరోజు కూడా వైద్య బృందాలు గ్రామంలో పర్యటించి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈరోజు వైద్య శిబిరంలో 145మందికి వైద్య సేవలు అందించగా 32 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రణధీర్, సైక్రియాటిస్ట్ డాక్టర్ నమ్రత, డాక్టర్ వైశాలి, డాక్టర్ నవ్య రాణి, ఇంచార్జ్ మాస్ మీడియా అధికారి సంపత్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాల నివారణకై పటిష్టమైన చర్యలు: ఎస్పీ రోహిత్ రాజ్

**కొత్తగూడెం, నవంబర్ 20, మహా:** జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థినీవిద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. చాలామంది యువత మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, మత్తు వలన విచక్షణ కోల్పోయి ప్రమాదాలకు గురవ్వడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం చేస్తున్నారని, అలాంటివారిలో మార్పు తీసుకురావడానికి పోలీస్ శాఖ తరపున అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా యువత భవిష్యత్తు నాశనం కాకూడదనే సదుద్దేశంతో పోలీస్ శాఖ తరపున ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలలో ర్యాగింగ్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని స్కూళ్లు, కళాశాలలో యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఆ దిశగా పటిష్టమైన ప్రణాళికతో జిల్లాలోని పోలీసు అధికారులు పని చేస్తున్నారని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని జిల్లా ప్రజలను కోరారు.

## ఘనంగా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు వేడుకలు



**అశ్వారావుపేట/అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20, మహా:** అన్నపురెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, 'వ్యవసాయం ఒక సైన్సే. అత్యున్నత వ్యవసాయ పద్ధతులకు దోహదపడే ఆవిష్కరణలను సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించడం అభినందనీయమైన విషయం. సైన్స్ ఫెయిర్ కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, వాటిని ప్రయోగాత్మకంగా నిరూపించగలిగే స్థాయికి విద్యార్థులను తీసుకువెళ్లాలి. మన విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, విజ్ఞానం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్తులో సమగ్ర వ్యవసాయ పద్ధతుల్ని అభివృద్ధి చేయడంలో ఈ జ్ఞానం ఉపయోగపడుతుంది' అని అన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, తాను ఒక ప్రజాప్రతినిధిగా కాకుండా, తన గత జీవితం ఉపాధ్యాయుడిగా ఉన్న అనుభవంతో ఈ సైన్స్ ఫెయిర్‌ను చూసి ఎంతో సంతోషిస్తున్నాను. విద్యార్థుల ఆవిష్కరణలు వారి ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయి. భవిష్యత్తు విద్యార్థులదేనన్నారు. వారు ఒక ఆలోచనతో ముందుకు సాగితే గ్రామాల అభివృద్ధి దిశగా మార్పులు తీసుకురాగలరన్నారు. మొక్కలు ఆటంకాలను ఎదుర్కొని ఎదిగినట్లే, విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను చేరుకోవాలి అని ప్రేరణాత్మకంగా వ్యాఖ్యానించారు. సైన్స్ ప్రదర్శనలలో విద్యార్థుల సృజనాత్మకత ప్రతిబింబిస్తోందని ఎస్పీ రోహిత్ రాజు ప్రశంసించారు. సైన్స్ ప్రదర్శనల సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీసీబీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.



### పదోన్నతి పొందిన ఏఎస్సైలకు

## అభినందనలు

**ఖమ్మం సిటీ, నవంబర్ 20, మహా:** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో హెడ్ కానిస్టేబుల్ గా భాధ్యతలు నిర్వహిస్తూ ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన ఐదుగురు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏఎస్సైలుగా పదోన్నతి పొందినవారు సీపీని కలిశారు. పదోన్నతి పొందిన వారిలో నూరుద్దీన్, కె. గేశ్వరరావు, బి.వి.ఆర్. రాజు, ఐ.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

## మాలల సింహాగర్జనను విజయవంతం చేయండి: ఐ.ఎమ్.ఎల్.ఎ




**ఖమ్మం సిటీ, నవంబర్ 20, మహా:** ఖమ్మం జిల్లా కోర్టు ఆవరణలో ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాలల సింహగర్జన పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఐఎమ్ ఎల్ఏ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ డిసెంబర్ ఒకటవ తేదీన సికింద్రాబాద్ జింకానా (పరేడ్) గ్రౌండ్ లో జరిగే మాలల సింహాగర్జన బహిరంగ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాలల అస్థిత్వాన్ని కాపాడుకోవాలి అని, ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మాల న్యాయవాదుల అధ్యక్షుడు రెంటాల ఆనంద్, జె శేఖర్, రాజు, గోరింట్ల శాంతరావు, మద్దెల వెంకటేశ్వర్లు, బాజీ జాలావతి భాస్కర్, కొప్పుల కృష్ణ, రవి, పి. చందు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

**సీనియారిటీ ప్రాధాన్యతతో జర్నలిస్టులకు సభ్యత్వాలు**




**ఖమ్మం సిటీ, నవంబర్ 20, మహా:** ఇళ్ల స్థలాల కోసం గత రెండు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న ఖమ్మం జర్నలిస్టులకు 'స్తంభాద్రి జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, ఖమ్మం తీపికబురు అందించింది. బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సీనియారిటీ ప్రాధాన్యతతో జర్నలిస్టులకు హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కనకం సైదులు, బొల్లం శ్రీనివాస్ లు మాట్లాడుతూ... 'స్తంభాద్రి జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మం నియమ నిబంధనల మేరకు వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుత అక్రిడిటేషన్ తోపాటు గత సీనియారిటీని పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. జర్నలిస్టులు ఐక్యమత్యంతో త్వరగా ఇళ్ల స్థలాలు పొందాలని జర్నలిస్ట్ యూనియన్లు అభిప్రాయబడ్డాయి. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... జర్నలిస్టులు తమ హక్కుల కోసం ఐక్యమత్యంతో పోరాడితేనే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో హౌసింగ్ సొసైటీకి మా సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టులు ఎవ్వరూ అపోహలకు పోవద్దని, హౌసింగ్ సొసైటీ నియమ నిబంధనలననుసరించి అర్హత కలిగిన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ సభ్యులు ఏనుగు వెంకటేశ్వరరావు, వెన్నబోయిన సాంబశివరావు, మైసా పాపారావు, బత్తుల వాసు, ఆలస్యం అప్పారావు, మాటేటి వేణుగోపాల్, నర్వనేని వెంకట్రావు, నలజాల వెంకట్రావు, చిర్రా రవి, సత్తుపాటి రామయ్య, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

**అంగన్‌వాడీలో పిల్లలకు ఐదు రకాల ఫ్రీ స్కూల్ మెటీరియల్ పంపిణీ**

**కల్లు గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్స్ పంపిణీ**

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క**




**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టనున్న నూతన రోడ్ల నిర్మాణ పనులను త్వరత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన రోడ్ల ప్రత్యేక మరమ్మతుల పనులకు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ లతో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీదేవిపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యా పరికరాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, ఐదు రకాల ఫ్రీ స్కూల్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలో రూ.12 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టడానికి నిర్ణయం తీసుకొని నిధులు సైతం కేటాయించడం జరిగిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను జాతీయ రహదారులకు అనుసంధానం చేయడానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రోడ్డు సౌకర్యం ఏర్పడినప్పుడే వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది వసతుల కల్పన, అభివృద్ధి చెందుతుందని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు ర.500ల బోనస్ ప్రకటించడంతోపాటు రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ఇప్పటివరకు 20 లక్షల మందికి చేసామని తెలిపారు. రానున్న రోజులలో రైతు భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తాము ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా అంగన్వాడీ కేంద్రాల పూర్వ ప్రాథమిక విద్యా పరికరాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ప్రారంభించడంలో భాగంగా అంగన్వాడీ పిల్లలకి యూనిఫామ్ ఇస్తున్నామని, ఐదు రకాల ఫ్రీ స్కూల్ మెటీరియల్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్ లకు ధీటుగా ఇంగ్లీష్ మీడియం చెప్పడం జరుగుతుందని, పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా శిశు సంక్షేమ అధికారిని కె.శిరీష, మండల అధికారులు, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.



## సీసీఐ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ

**ముదిగొండ, నవంబర్ 20, మహా:** మండల పరిధి న్యూలక్ష్మీపురం ఉషశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాన్ని బుధవారం ఆర్డీఓ గరిడి నరసింహారావు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోలు విధానం, ట్రాన్స్ పోర్ట్, బిల్లుల వివరాలను అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె సునీత ఎల్జిబెత్, నేలకొండపల్లి ఏఎంసీ సెక్రెటరీ నాగమల్లేశ్వరి, ఆర్ఐలు ఎస్కే వహీదాసుల్తానా, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో కూడిన ధాన్యాన్ని సేకరించాలి

**కలెక్టర్ దివాకర టీఎస్**

**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** ఖరీఫ్ 2024 -25సీజన్ కి సంబంధించి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎఫ్ఏక్యూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఒక ప్రకటనలో సూచించారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం లేని ధాన్యాన్ని కొనుగోలు చేసి అటు రైతులకు ఇటు మిలర్లకు ఇబ్బందులకు గురి చేస్తే కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిదంగా రైస్ మిల్లర్లు, బఫర్ గోదాం ఇన్చార్జీలు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించి దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. నాణ్యత ప్రకారం ఉన్న ధాన్యాన్ని ఎటువంటి కోత విధించకుండా తీసుకోవాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగరవేయాలి**

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య**



**మణుగూరు, నవంబర్ 20, మహా:** సీపీఐ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగురవేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య పిలుపునిచ్చారు. మంగళరం రాత్రి మద్దలగూడెం గ్రామంలో కారం దుర్గ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ..... పార్టీ పుట్టి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న లేకున్నా పేద ప్రజల సంక్షేమం కోసం సీపీఐ పార్టీ ఎల్లప్పుడు వారికి అండగా పని చేస్తుందన్నారు. అందుకోసం పార్టీని ఆదరించాలని వారు పిలుపునిచ్చారు. యువత ముందుకు రావాలని పార్టీ నిర్మాణం కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు కనితి సత్యనారాయణ, గిరిజన సమాఖ్య మణుగూరు మండల కార్యదర్శి వజ్రా వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11 మందితో నూతన కమిటీ ఎన్నిక అయ్యారు.

## నర్సాపురం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలి

**నాజర్ పాషా**



**మణుగూరు, నవంబర్ 20, మహా:** సూర్యాపేట దేవరపల్లి నిర్మాణ దశలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో టీ నర్సాపురం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని కోరుతూ బుధవారం ఖమ్మంలో నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కర్నె దివ్యను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఐఎఫ్టీయూ అనుబంధ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.డి నాజర్ పాషా విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే జాతీయ రహదారిలో టీ నర్సాపురం వద్ద ఎగ్జిట్ ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. ఈ జాతీయ రహదారి నిర్మాణం కోసం టీ నర్సాపురం మండల ప్రజలు ఎంతో విలువైన తమ పచ్చని పొలాలను, తోటలను కూడా త్యాగం చేశారన్నారు. టీ నర్సాపురం మండలానికి చెందిన అనేకమంది యువతీయువకులు, పలు కుటుంబాలు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో వివిధ ఉద్యోగాల రీత్యా నివసిస్తున్నారని, దాంతో ఈ మండలం నుండి హైదరాబాద్ కి వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను, త్యాగాలను గుర్తించి మండల కేంద్రం టీ నర్సాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే లో ఎగ్జిట్ ఇచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ను విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఊరుకొండ శ్రీనివాస్, మిట్టకోలు లక్షణాద్రి, ఎండీ అహ్మద్, ఎండీ ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కెరియర్ అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి**



**ఖమ్మం, నవంబర్ 20, మహా:** విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత తమకు ఉన్న వివిధ కెరియర్ అవకాశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సూచించారు. బుధవారం శాంతినగర్ ఎ.ఎస్.ఆర్. జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన ఉపాధి అవకాశాల అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారిణి, మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన తరువాత వివిధ రంగాలలో ఎంచుకోవాల్సిన ఉపాధి మార్గాల గురించి వివరించారు. ఇందులో భాగంగా వివిధ పోటీ పరీక్షలు స్టాఫ్ సెలక్షన్ కమిటీ, సివిల్స్ పరీక్షలు, ఐబీపీఎస్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, ఎన్.డి.ఎ, ఎస్.ఎస్.బి. గురించి విద్యార్థులకి వివరించారు. భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకోవాలన్న ముందుగా ఇంటర్ పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, అకడమిక్ లో విద్యార్థులంతా బలమైన పునాది ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ప్రస్తుత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, డిజిటల్ ప్రపంచానికి బానిసలై పుస్తక పరిజ్ఞానానికి దూరం కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.ఆర్. కళాశాల ప్రిన్సిపాల్ గోవింద రావు, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ ఉష, లెక్చరర్స్ పాల్గొన్నారు.

## రేపు మధిర నియోజకవర్గంలో హరీష్ రావు పర్యటన

**బీఆర్ఎస్ నేత లింగాల కమల్ రాజు**



**మధిర, నవంబర్ 20, మహా:** నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో ఈ నెల 22న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పర్యటనను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ 22న ఉదయం 11 గంటలకు ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో తన్నీరు హరీష్‌రావు పర్యటిస్తారని, ఈ సందర్భంగా పలు రైతు కుటుంబాలను పరామర్శించి, ఇటీవల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్యపై అక్రమ కేసు పెట్టి జైలుకు తరలించిన నేపథ్యంలో వారిని పరామర్శించి, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు అని తెలిపారు. ఈ పర్యటనను బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వివేకానంద బోధనలు నేటికీ స్ఫూర్తిదాయకం

**ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి దేవి**



**సత్తుపల్లి, నవంబర్ 20, మహా:** భారతదేశ గొప్పతనాన్ని, సంస్కృతిని, సాంప్రదాయాలను తన ఆధ్యాత్మిక బోధనల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద జీవితం నేటి విద్యార్థులకు , యువతకు స్ఫూర్తిదాయకమని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి దేవి అన్నారు. విశ్వశాంతి విద్యాలయంలో స్వామి వివేకానంద జీవితం పట్ల అవగాహన కొరకు విద్యార్థులకు "స్వామి వివేకానంద జీవితం సందేశం" అనే పుస్తకాలను కొద్దిరోజుల క్రితం అందజేశారు. బుధవారం విద్యార్థులకు ఈ పుస్తకానికి సంబంధించి వ్యాసరచనల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 120 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. 'చదువు జ్ఞానాన్నిపెంచుతుంది. జ్ఞానం సంస్కారాన్ని పెంచుతుంది. సంస్కారం మనిషి విలువలను పెంచుతుంది' అని విద్యార్థులకు హితబోధ చేశారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... "ధైర్యంలోనే బతుకు ఉంది, భయంలోనే చావు ఉంది, స్వయంకృషి, పట్టుదల, దృఢ సంకల్పం ఉన్నవారు ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి వెళ్ళగలరు అని స్వామి వివేకానంద పేర్కొన్న బోధనలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్యం నరుకుల్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లల సృజనాత్మక శక్తిని వెలికితీయడం అభినందనీయం

**విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి**

**త్వరలో నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తా**

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం, నవంబర్ 20 మహా:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారలని, ప్రత్యక్ష దేవాలయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవల ముంగింపు సందర్భంగా కొత్తగూడెం అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కూనంనేని మాట్లాడుతూ 57వ జాతీయగ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారని, ఆ పోటీల్లో పిల్లలు సంతోషంతో పాల్గొన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పిల్లలో దాగుతున్న సృజనాత్మక శక్తియుక్తులను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయని, విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఆకాశమే హద్దుగా వారు ఉత్సాహంతో అనేక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుకు వస్తారని చెప్పారు. ఆటపాటలతో హాయిగా సాగిపోయే బాల్య మస్తిష్కంలో ఎన్నో ఆలోచలు దాగుంటాయని, వాటిని మెరుగుపరుచుకునేందుకు వేదికలు దొరికితే అంతకు మించిన ఆనందం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కావు సీతామహాలక్ష్మీ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, గ్రంథాలయ కార్యదర్శి వి అర్జున్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్కే దస్తగిరి, వివేకవర్ధిని ప్రిన్సిపాల్ మహేష్, హెచ్ఎం నీరజ, గ్రంథాలయ ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్, గ్రంథ పాలకులు మణి మృదుల, మధుబాబు, రుక్మిణి గీత, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రత చట్టంపై విస్తృత ప్రచారం కల్పించాలి

**ప్రతి పౌరుడికి పౌష్టిక ఆహారం హక్కు.. తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు**




**ఖమ్మం, నవంబర్ 20, మహా:** ఆహార భద్రత చట్టంపై విస్తృత ప్రచారం కల్పించాలని తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ అన్నారు. బుధవారం తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భూక్యా జ్యోతిలు ఏన్కూర్, కొణిజర్ల, వైరా మండలాల్లో పర్యటించి ఏన్కూరులో అంగన్వాడీ కేంద్రం, కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, హిమామ్ నగర్ గ్రామంలో చౌకధరల దుకాణం, కొనిజర్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, తనికెళ్ళ గ్రామంలోని కస్తూరిబా బాలుర రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఏన్కూరు అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసి కోడిగుడ్ల సైజ్, నాణ్యతను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పోషకాల లోపం పిల్లల గుర్తింపు, అనీమియా గర్భిణీ మహిళల గుర్తింపు, వారికి ఐరన్ మాత్రలు సరఫరా, మొదలగు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏన్కూరు కస్తుర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి బాలికల రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి ఎంత మందికి 12 శాతం ఉందో తెలుసుకున్నారు. కేజీబీవి వంటశాలలో గుడ్ల సైజ్, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. రేషన్ షాప్ ను తనిఖీ చేసి రేషన్ షాపు పరిధిలో ఆహార భద్రత కార్డులు, అంత్యోదయ కార్డులు ఎన్ని ఉన్నాయి, బియ్యం, ఆయిల్ నాణ్యత గా సరఫరా చేస్తున్నారా లేదా అని పరిశీలించి, రేషన్ కార్డుదారులతో బియ్యం సరిగ్గా సరఫరా అవుతుందా, ఓటీపీ సమస్యలు ఏమైనా ఉన్నాయా వంటి వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు




**కొత్తగూడెం, నవంబర్ 20, మహా:** జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు ప్రగతి మైదానం కొత్తగూడెం నందు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తగూడెం శాసన సభ్యులు కునంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లూయిస్ బ్రెయిలీ, స్టీఫెన్ హాకింగ్, పారా ఒలంపిక్స్ లో గెలుపొందిన వారిని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాలలో జిల్లాను ముందు ఉంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తానని, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో కూడా పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. రన్నింగ్, చేస్, షార్ట్ పుట్, కారమ్స్, ట్రై సైకిల్ రెస్ వంటి ఆటల పోటీలలో పాల్గొనీ మొదటి స్థానంలో నిలిచినవారిలో శారీరక దివ్యాంగులలో శృతి, నాగేంద్ర బాబు, శైలజ, ఖాసిం, దీపిక, అంధులలో సందీప్, వైశాలి, నరేందర్, రమణయ్య, నంద కిషోర్, బధిరులలో సాయి కౌశిక్, అనిత, అన్నపూర్ణ, సాగర్, శ్రావణ్ మరియు మానసిక దివ్యాంగులలో రవీందర్, సమతా శ్రీ, ముష్కాన్, నారాయణ , వైష్ణవి మొదటి స్థానంలో గెలుపొందిన వారికి మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ప్రసాద్, క్రిసోలిక్, కృష్ణ వేణి, వికాసం స్కూల్ సిబ్బంది అరుణ, దివ్యాంగుల అసోసియేషన్స్ సభ్యులు జి. సతీష్, రమణయ్య, రామ లింగ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సుధీర్, లక్ష్మయ్య, మంజిలాల్, కనక దుర్గ, సంతోష్, స్పెషల్ స్కూల్స్ టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు, హబ్ స్టాఫ్ రూప, సాహితీ, మౌనిక, స్వాతి, ఐసీపిఎస్ స్టాఫ్ సందీప్, రంజిత్, నాగరాజు, కార్యాలయ సిబ్బంది వర ప్రసాద్, నాగేశ్వర రావు, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యామిలీతో కలిసి ఓటేసిన ముకేశ్ అంబానీ..

**మహా, మహారాష్ట్ర:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపారవేత్తలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ముంబైలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తన కుమారులు ఆకాశ్ అంబానీ, అనంత్ అంబానీ, కోడలు శ్లోకా మెహతాతో కలిసి ఓటు వేశారు. మహారాష్ట్రలోమొత్తం 288 శాసనసభ నియోజక వర్గాలకు పోలింగ్ జరుగుతోంది. 9.63 కోట్ల మంది ఓటర్లు 4 వేల 136 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుండగా 31 సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఈ నెల 23 మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.



# గోల్డ్ లోన్లకూ ఈఎంఐలు

## పరిచయం చేసే యోచనలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాల మంజూరులో లోపాల్ని గుర్తించిన ఆర్బీఐ



**న్యూఢిల్లీ, మహా:** గోల్డ్ లోన్లకూ త్వరలో ఈఎంఐలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా తదితర రుణాలకే నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ) సౌకర్యం ఉన్నది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే అప్పులకు ఈ సదుపాయం లేదు. అయితే ఈ రుణాల మంజూరులో ఆర్బీఐ రకరకాల లోపాలను గుర్తించింది. దీంతో బ్యాంకులు, గోల్డ్ లోన్ కంపెనీల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు బంగారంపై రుణాలకూ ఈఎంఐలను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

**ఇదీ సంగతి**

బంగారు ఆభరణాలను తనఖా పెట్టి తీసుకునే రుణాల్లో లోపాలను గుర్తించామని ఈ సెప్టెంబర్ 30న ఓ సర్క్యులర్‌లో ఆర్బీఐ తెలిపింది. విలువ, పరిశీలన, రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, వేలం వంటి అంశాల్లో బ్యాంకులు, రుణదాతలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తారా? లేదా? అన్నది చూడాలని ఆర్బీఐ అంటున్నది. దీంతో ఈఎంఐ ఆధారిత వ్యవస్థను గోల్డ్ లోన్లకూ తేవాలనుకుంటున్నట్టు బ్యాంకర్లు చెప్తున్నారు. కాగా, సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు రూ.1.4 లక్షల కోట్ల గోల్డ్ లోన్లను ఇచ్చాయి. గతంతో పోల్చితే 51 శాతం పెరిగాయి.

# నూతన ఆవిష్కరణల అడ్డాగా హైదరాబాద్

## రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా:** నూతన ఆవిష్కరణలకు ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంటున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఎవర్‌నార్త్ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ హబ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ జీసీసీ సెంటర్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పించనున్నదని, దీంట్లోభాగంగా తొలి విడత వెయ్యి మంది ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలను లభించనున్నాయని, ఈ ఆధునిక కేంద్రం హైదరాబాద్‌లోని నిపుణుల సామర్థ్యాన్ని వినియోగించుకొని ఆరోగ్య రంగంలో ఐటీ వినియోగాన్ని మరింత విస్తృతపరుస్తున్నదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. భారత్‌లో ఏర్పాటు చేసిన తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఇదేనన్నారు. బెంగళూరుకు చెందిన సిగ్నా హెల్త్ సొల్యూషన్స్‌తో కలిసి భారత్‌లో డాటా, అనలిటిక్స్ సేవలు అందిస్తున్నది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎవర్ నార్త్ 1.9 కోట్ల మంది భారతీయులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నది. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలను విస్తరించిన ఎవర్‌నార్త్‌లో ప్రస్తుతం 75 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.




# ఇక బ్యాంకుల వంతు

## నాలుగు బ్యాంకుల్లో వాటా విక్రయించే దిశగా కేంద్రం

**న్యూఢిల్లీ, మహా:** ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వాటాను విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. సెబీ మార్గదర్శకాలకు లోబడి నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వాటాను విక్రయించబోతున్నది. వీటిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లు ఉన్నాయి. వీటిలో సెంట్రల్ బ్యాంక్‌లో కేంద్రానికి 93 శాతం వాటా ఉండగా, ఇండియన్ ఓవర్‌సీస్‌లో 96.4 శాతం, యూకోలో 95.4 శాతం, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లో 98.3 శాతం వాటా ఉన్నది. మార్కెట్ రూల్స్ ప్రకారం స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో పబ్లిక్ షేరుహోల్డర్లు 25 శాతం వాటా కలిగివుండాలనే నిబంధనకు అనుగుణంగా కేంద్రం ఈ వాటాలను విక్రయించడానికి సిద్ధమైంది. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్న ఈవాటాను ఎప్పటిలోగా, ఎంత శాతం వాటా విక్రయించేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.



# దేశం-విదేశం NATIONAL NEWS





## పెళ్లికి ఒప్పుకోలేదని..

### స్కూల్ టీచర్‌ను చంపిన వ్యక్తి

**మహా, చెన్నై:** తమిళనాడులో దారుణం జరిగింది. తంజావూర్ జిల్లాలో 26 ఏళ్ల స్కూల్ టీచర్ రమణి హత్యకుగురైంది. 30 ఏళ్ల మదన్ అనే వ్యక్తి ఆమెను హతమార్చాడు. వివరాల్లోకి వెళ్తే.. మల్లీపట్టణం గవర్నమెంట్ స్కూల్‌లో రమణి టీచర్‌గా పనిచేస్తున్నది. అయితే ఇటీవల రమణి, మదన్ కుటుంబ సభ్యులు పెళ్లి కోసం చర్చలు జరిపారు. కానీ పెళ్లి ప్రపోజల్‌ను రమణి నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆవేశానికి గురైన మదన్.. ఆమెపై అటాక్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగతమైన కక్షతో మదన్ దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు, అతన్ని విచారిస్తున్నారు. మెడలో తీవ్రగాయాలైన రమణిని.. ఆస్పత్రికి తరలించారు. కానీ ఆమె మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది. పెళ్లికి రమణి నిరాకరించడంతో.. ఆమె స్కూల్‌కు వెళ్లిన మదన్.. తన చేతుల్లో ఉన్న పదునైన ఆయుధంతో మెడపై అటాక్ చేశాడు.

## ఎన్నికల మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు.. సస్పెండ్



**లక్నో:** ఎన్నికల మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లు పోలీసులపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ఆదేశించింది. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలకు సూచించింది. ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లోని సిసమావు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక నేపథ్యంలో బుధవారం పోలింగ్ జరిగింది.కాగా, ఎన్నికల విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు ఓటర్లను వేధిస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. చట్టవిరుద్ధంగా ఓటరు కార్డులు, ఆధార్ ఐడీలను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈసీకి ఫిర్యాదు చేయడంతోపాటు వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. మరోవైపు ఈ ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఎన్నికల మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులపై చర్యలు చేపట్టింది. ఎన్నికల విధుల్లో మోహరించిన పోలీసుల్లో ఆరోపణలు వచ్చిన వారిని సస్పెండ్ చేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. దీంతో ఏడుగురు పోలీస్ అధికారులపై చర్యలు చేపట్టారు. కాన్పూర్, ముజఫర్‌నగర్ జిల్లాల్లో ఇద్దరు చొప్పున, మొరాదాబాద్‌లో ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేశారు.



## గోనె సంచిలో దళిత బాలిక మృతదేహం..

### బీజేపీకి మద్దతిచ్చినందుకే హత్య చేశారని ఫ్యామిలీ ఆరోపణ

**మహా, లక్నో:** గోనె సంచిలో దళిత బాలిక మృతదేహాన్ని గుర్తించారు. ఉప ఎన్నికల్లో బీజేపీకి మద్దతిచ్చినందుకు ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడి చంపినట్లు ఆమె కుటుంబం ఆరోపించింది. ఒక వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 19న కర్హల్‌లో ఇద్దరు వ్యక్తులు దళిత యువతిని కిడ్నాప్ చేశారు. బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు కొందరు చూశారు. అయితే బుధవారం కంజారా నది వంతెన వద్ద ఆ దళిత యువతి నగ్న మృతదేహం గోనె సంచిలో కనిపించింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దళిత యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె హత్య వెనుక రాజకీయ నేపథ్యం ఉందని ఆమె కుటుంబం తెలిపింది. ఉప ఎన్నికలో బీజేపీకి మద్దతిచ్చినందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి చెందిన ప్రశాంత్ యాదవ్ ఆమెను బెదిరించినట్లు ఆరోపించింది. అతడు ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మరో మార్గంలో కొత్తగా వందే భారత్ రైలు..



**మహా:** భారతీయ రైల్వేశాఖ కొత్తగా మరో రూట్‌లో వందే భారత్ రైలును ప్రవేశపెట్టనున్నది. ఇప్పటికే సెమీ హైస్పీడ్ రైలు దేశవ్యాప్తంగా 50కిపైగా మార్గాల్లో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఈ కొత్త రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలోనే మరికొద్ది మార్గాల్లో రైల్వేశాఖ సెమీ హైస్పీడ్ రైళ్లకు శ్రీకారం చుట్టబోతున్నది. ఉధంపూర్‌శ్రీనగర్‌బారాముల్లా రైల్ లింక్ (USBRL) లో కశ్మీర్ నుంచి న్యూఢిల్లీకి అనుసంధానించే వందే భారత్ రైలును వచ్చే ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ తెలిపారు. ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన చీనాబ్ రైలు వంతెనగుండా వెళ్తుందని పేర్కొన్నారు. 272 కిలోమీటర్ల యూఎస్‌బీఆర్‌ఎల్ ప్రాజెక్ట్‌లో రైల్వే 255 కిలోమీటర్ల పూర్తయ్యింది. కత్రా, రిసియా మధ్య 17 కిలోమీటర్లు డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఈ ఏడాది చివరి వరకు ప్రాజెక్టు పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించాల్సి ఉందని.. ఇప్పటికే సాంకేతిక బృందాలు తనిఖీ చేసి ప్రామాణికంగా ఉండేలా చూస్తున్నారన్నారు. ప్రధాని షెడ్యూల్ ప్రకారం.. జనవరిలో వందే భారత్ రైలు ప్రారంభోత్సవం ఉంటుందని రైల్వేమంత్రి రవ్‌నీత్ సింగ్ పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించిన తర్వాతే ప్రారంభోత్సవం తేదీని నిర్ణయించన్నట్లు మంత్రి పేర్కొన్నారు. చలికాలంలో హైవేపై ట్రక్కులు, వాహనాల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు లోయలో ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు.పర్యాటకానికి ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఇది కశ్మీర్ ప్రజలకు ఎన్‌డీఏ ప్రభుత్వం, ప్రధానమంత్రి ఇచ్చిన బహుమతి అని పేర్కొన్నారు. గతంలో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని.. గత ఎనిమిదేళ్లలో పనులు వేగవంతం చేశామన్నారు. ప్రాజెక్ట్‌లో పాలుపంచుకున్న ఉద్యోగులు, అధికారుల త్యాగాలు, కృషిని మంత్రి గుర్తు చేశారు. డిసెంబరు 25 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లోనూ ఈ ప్రాజెక్టుపై చర్చిస్తామన్నారు. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కశ్మీర్‌కు కేవలం రూ.1,500 నుంచి రూ.2100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉంటాయన్నారు. ప్రాజెక్టు అపారమైన పర్యాటక సామర్థ్యం కలిగి ఉందని.. ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని పెంచుతుందన్నారు.

## మహా ఎన్నికలు..

### ఓటేసిన సినీ ప్రముఖులు



**మహా:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మందకొడిగా సాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంట వరకూ 32 శాతం మాత్రమే నమోదైంది. ఇక బాలీవుడ్ తారలు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. బీటౌన్ సెలబ్రిటీలు మాధురీ దీక్షిత్, రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ, అర్జున్ కపూర్, ప్రేమ్ చోప్రా, సింగర్ కైలాశ్ ఖేర్, సునీల్ శెట్టి, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా, సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ ఖాన్, పూనమ్ దిల్లాన్, జునైద్ ఖాన్, జావెద్ అక్తర్, మనీశ్ మల్హోత్ర, సింగర్ శంకర్ మహదేవన్, డైరెక్టర్ రోహిత్ శెట్టి తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ విలువైన ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ నియోజక వర్గాలకు పోలింగ్ జరుగుతోంది. 9.63 కోట్ల మంది ఓటర్లు 4 వేల 136 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుండగా 31 సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఈ నెల 23 మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ANN తెలుగు

ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో వరుస సెంచరీలు సాధించిన టీమిండియా యువ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ ఏకంగా 69 స్థానాలను మెరుగుపరుచుకొని ఏకంగా టాప్‌కి చేరుకున్నాడు. తిలక్ టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టాప్ 10లో చోటు సంపాదించడం ఇదే తొలిసారి. ఇంగ్లండ్ ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్‌ను వెనక్కి నెట్టి భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నెంబర్ వన్ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో పాండ్యా బ్యాట్‌తో పాటు బాల్‌తోనూ అద్భుత ప్రదర్శన చేశాడు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 31 తేడాతో గెలుచుకున్నది. టీ20 ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకోవడం ఇది రెండోసారి. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ నాలుగో స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ వనిందు హసరంగ ఐదో స్థానంలో నిలిచారు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో టీమిండియా యువ ఆటగాడు తిలక్ 280 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో 69 స్థానాలను మెరుగుపరుచుకొని మూడోస్థానానికి చేరుకున్నాడు.



# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల..

## మూడోస్థానానికి చేరిన యువ సంచలనం తిలక్ వర్మ

నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ కొనసాగుతుండగా.. రెండోస్థానంలో ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ ఉన్నాడు. ఇక టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఒక స్థానం దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించిన సంజూ శాంసన్.. టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకుల జాబితాలో 17 స్థానాలను మెరుగుపరుచుకొని 22వ స్థానానికి చేరాడు. ట్రిస్టన్ స్టబ్స్ మూడు స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి, హెన్రిచ్ క్లాసెన్ ఆరు స్థానాలు ఎగబాకి 59వ స్థానానికి చేరుకున్నారు. శ్రీలంక కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ కుశాల్ మెండిస్ టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో 12వ ర్యాంక్‌కు చేరుకోగా, వెస్టిండీస్‌కు చెందిన షాయ్ హోప్ 16 స్థానాలు ఎగబాకి 21వ స్థానానికి చేరుకున్నాడు. కాగా, పాకిస్థాన్‌పై హాఫ్ సెంచరీ చేయడంతో ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ 10 స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి చేరుకున్నాడు. భారత ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు ఎగబాకి తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. అతని కెరీర్లో ఇదే బెస్ట్ ర్యాంకింగ్ కావడం విశేషం.

# సర్ఫరాజ్ ఫీల్డింగ్ చూసి..

## పగలబడి నవ్విన కోహ్లీ, పంత్..

**పెర్త్:** ఆస్ట్రేలియాతో శుక్రవారం ప్రారంభం అయ్యే తొలి టెస్టుకోసం టీమిండియా ఆటగాళ్లు.. పెర్త్ మైదానంలో జోరుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇప్పటికే ఓ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడిన సీనియర్ క్రికెటర్లు, రెండు రోజులుగా ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే మంగళవారం ఆ ప్రాక్టీస్ సెషన్‌లో ఓ ఆసక్తికరమైన సంఘటన జరిగింది. సర్ఫరాజ్ ఖాన్ ఫీల్డింగ్ స్టయిల్ చూసి కోహ్లీ, పంత్, జురల్ నవ్వుకున్నారు. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతున్నది. క్యాచ్‌లు ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో.. సర్ఫరాజ్ తన ముఖం వద్దకు చేరుకున్న బంతిని క్యాచ్ పట్టాడు. అయితే ఆ క్యాచ్ పట్టిన స్టయిల్‌తో అక్కడ ప్రాక్టీస్ చేస్తున్న ఫీల్డర్లు తెగ నవ్వుకున్నారు. కోహ్లీ పగలబడి నవ్వగా, ఇక పంత్ ఏకంగా కిందపడిపోయి గట్టిగా నవ్వేశాడు. సర్ఫరాజ్ కూడా అందరితో ఆ నవ్వుల్లో మునిగిపోయాడు.





# పుణెరి, యూపీ పోరు టై

**మహా, స్పోర్ట్స్:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను ఊపేసింది. మంగళవారం డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్, యూపీ యోధాస్ మధ్య జరిగిన మ్యాచ్ 2929 పాయింట్లతో టై గా ముగిసింది. ఆట నిర్దేశిత సమయానికి ఇరు జట్ల స్కోర్లు సమానం కావడంతో రెండు జట్లకూ తలా 3 పాయింట్లు దక్కాయి. యూపీ తరఫున భవానీ రాజ్‌పుత్ 10 పాయింట్లతో మెరవగా పూణె కెప్టెన్ మోహిత్ 9 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పాట్నా.. 5431తో బెంగళూరుపై విజయం సాధించింది.

# ఐపీఎల్ చరిత్రలో వేలంలోకి ఎంట్రీ ఇచ్చిన నలుగురు అత్యంత పిన్నయస్కులు వీళ్లే..!



**మహా, స్పోర్ట్స్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025కి ముందు మెగావేలం నవంబర్ 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా జరుగనున్నది. యువ క్రికెటర్లతోపాటు సీనియర్ ఆటగాళ్లు వేలానికి రానున్నారు. ఐపీఎల్ యువ ఆటగాళ్లకు కీలకంగా మారనున్నది. ఐపీఎల్‌లో మంచి ప్రదర్శన కనబరిస్తే జాతీయ జట్టులో ఎంపికయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలువురు ఆటగాళ్లు ఐపీఎల్‌లో రాణించి.. జాతీయ జట్టులో చోటు సాధించారు. ఈ సారి వేలం పూల్‌లో 318 మంది అన్‌క్యాప్డ్ ఇండియన్ ప్లేయర్స్, 12 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్స్ సహా మొత్తం 574 మంది ఆటగాళ్లు ఉన్నారు. షార్ట్‌లిస్ట్ చేసిన ఆటగాళ్ల జాబితాలో 366 మంది భారతీయ ఆటగాళ్లు, 208 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. ఈ వేలం యువ క్రికెటర్లకు కీలకం కానున్నది. 204 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తీసుకోనుండగా.. ఇందులో 70 మంది విదేశీ ఆటగాళ్లకు చోటు కల్పించనున్నది. ఇప్పటి వరకు జరిగిన లీగ్ వేలం చరిత్రలో అత్యంత పిన్న వయస్కుల ఆటగాళ్ల గురించి ఓసారి తెలుసుకుందాం..!

**ముజీబ్ ఉర్ రెహ్మాన్**

ముజీబ్ ఉర్ రెహ్మాన్ ఆఫ్ఘనిస్తాన్ మిస్టరీ స్పిన్నర్. 2048లో 16 సంవత్సరాల 296 రోజుల వయసులో ఐపీఎల్ వేలంలో అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. షార్ట్‌లిస్ట్ అయిన తర్వాత అతన్ని పంజాబ్ కింగ్స్ (అప్పటి పంజాబ్ కింగ్స్ ) రూ.4 కోట్లకు తీసుకుంది. అదే సంవత్సరంలో అతను 11 మ్యాచ్‌లలో 14 వికెట్లు పడగొట్టాడు. అదే ఏడాది భారత్‌తో జరిగిన చారిత్రాత్మక తొలి టెస్టు మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత మరో మైలురాయిని సాధించాడు. తర్వాతి రెండుసీజన్లలో పంజాబ్ ఫ్రాంచైజీ అతన్ని కొనసాగించింది. కానీ, ఏడు మ్యాచ్‌లలో కేవలం మూడు వికెట్లతో నిరాశపరిచాడు. ఆ తర్వాత అతన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ తీసుకుంది. ఆడిన ఒక్క మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ సారి మరోసారి వేలంలోకి రానున్నాడు.

**ప్రయాస్ రే బర్మన్**

బెంగాల్‌కు చెందిన ప్రయాస్ రే బర్మాన్ 2019 ఐపీఎల్ వేలంలోకి ఎంట్రీ ఇచ్చాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అతన్ని రూ.1.5 కోట్లకు కొనుగోలు చేసింది. 16 సంవత్సరాల 54 రోజుల వయస్సులో ఐపీఎల్‌లో కాంట్రాక్ట్ సంపాదించిన అతి పిన్న వయసుగల ఆటగాళ్లలో ఒకడు. మార్చి 31, 2019న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. ఆ సీజన్‌లో నాలుగు ఓవర్లు వేసినా వికెట్ల పడగొట్టలేక పోయాడు. బ్యాట్‌తో 19 పరుగులు చేసినా ఆ తర్వాత మ్యాచ్‌లలో అవకాశం దక్కలేదు. అతను ఆడిన ఏకైక ఐపీఎల్ మ్యాచ్ ఇదే. దురదృష్టవశాత్తు 2020 సీజన్‌కు ముందు ఆర్సీబీ విడుదల చేసింది.

**అల్లా గజన్‌ఫర్**

అల్లా గజన్‌ఫర్ ఆఫ్ఘన్ ఆటగాడు. ఐపీఎల్ 2023లో ఎంట్రీ ఇచ్చాడు. కేవలం 15 ఏళ్ల 161 రోజుల వయస్సులో ఐపీఎల్ వేలంలోకి ప్రవేశించి వార్తల్లో నిలిచాడు. అయితే, అతను అప్పట్లో అమ్ముడవలేదు. 2024లో ముజీబ్ ఉర్ రెహమాన్ స్థానంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌లో చేరగా.. అదృష్టం మారింది.

# సినిమా వార్తలు MOVIE NEWS

# రష్మీకతో లవ్ పై ఓపెన్ అయిన విజయ్ దేవరకొండ..?

**సినిమా, మహా:** గత కొన్నేళ్లుగా హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికల మధ్య ఎఫైర్ నడుస్తుందనే రూమార్స్ నెట్టింటా జోరుగా చర్చ నడుస్తోంది. ఇందుకు కారణం ముంబై ఎయిర్‌పోర్టులో విజయ్, రష్మిక ఒకరి తరువాత మరొకరు కనిపించడం .. ఆ వెంటనే ఒకే మాల్దీవుల్లో రష్మిక, విజయ్ వేర్వేరుగా దర్శనం ఇవ్వడంతో.. వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారంటూ నెటిజన్స్ కామెంట్స్ రూపంలో గుసగుస లాడుతున్నారు. అయితే, ఈ కామెంట్స్ పై ఎప్పటికప్పుడు వారు స్పందిస్తూ తమ మధ్య అలాంటిదేమీ లేదని చెప్పుకొస్తూనే ఉన్నారు. అయినా కూడా వారిపై ఇటువంటి వార్తలు వస్తూనే ఉన్నాయి. తాజాగా కూడా వీరిద్దరిపై కామెంట్స్ వచ్చాయి. వీరిద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నారని కామెంట్స్ వెల్లువెత్తాయి. దీనిపై విజయ్ దేవరకొండ స్పందించారు. 'ప్రేమ అనేది తప్పక పుడుతుంది అబ్బాయిలు. మీరు ఇంకా యంగ్‌గానే ఉన్నారు కాబట్టి కొద్దిగా టైమ్ ఇవ్వండి. అన్నిటికంటే ముందుగా పురుషులు ఎదగాలి. ఇదేం చెడ్డ విషయం కాదు. మీరు కొంచెం సమయం ఇవ్వాలి దానికి. లవ్ విషయంలో 30 దాటిన పురుషులు 20 ఏండ్ల మధ్య ఉన్నవారికంటే బెటర్‌గా ఆలోచిస్తారు. ఈ విషయం నా పర్సనల్ అనుభవం. 20 నుండి 30 ఏళ్ల మధ్య ఉన్నప్పుడు మనం అస్థిరంగా ఉంటాం. ఏది కూడా సరిగ్గా డిసైడ్ చేసుకోలేం. సమయం వచ్చినప్పుడు అవే జరుగుతాయి. ఏది ఫోర్స్‌గా చేయొద్దు' అని పోస్ట్ పెట్టారు. దీంతో ఆ పోస్ట్ వైరల్ అవుతుంది.



# తల సినిమా టీజర్ విడుదల

**సినిమా, మహా:** సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎన్నో బ్లాక్ బస్టర్ సక్సెస్ లు అందుకున్న నిర్మాత ఆర్బీ చౌదరి, ఆయన సమర్పణలో మెగా సూపర్ గుడ్ ఫిలింస్ "తల" అనే కొత్త చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. "తల" చిత్రానికి ఎన్ వీ ప్రసాద్, వాకాడ అంజన్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ అమ్మ రాజశేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో అమ్మ రాజశేఖర్ వారసుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా పరిచయం అవుతున్నారు. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు ఈ సినిమా రెడీ అవుతోంది. ఈ రోజు తల సినిమా టీజర్ లాంఛ్ ఈవెంట్ హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా జరిగింది.



# గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'M4M'మూవీ హిందీ ట్రైలర్ విడుదల

**సినిమా, మహా:** మూవీ మేకర్ మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన M4M మూవీ దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో ఈ మూవీ హిందీ ట్రైలర్ ప్రతిష్ఠాత్మక గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ (Goa IFFI)లో విడుదల కానుంది. ఈ నెల 23న సాయంత్రం 7 గంటలకు గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో IMPPA ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, దేశ విదేశీయ సినీప్రముఖుల సమక్షంలో హిందీ ట్రైలర్ లాంచ్ చేయబోతోంది చిత్ర యూనిట్. కాగా, తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం భాషలలో తెరకెక్కింది ఈ సస్పెన్స్ థ్రిల్లర్. మునుపెన్నడూ ఎరుగని సైకోని ప్రేక్షకులు చూడబోతున్నారని, మర్డర్ మిస్టరీ ఒక సెన్సేషన్ కాబోతుందని ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒడిశా సూపర్ స్టార్ సంబీట్ ఆచార్య, అమెరికన్ హీరోయిన్ జో శర్మ లకు ప్యాన్ ఇండియా స్కేల్ లో కొత్త అధ్యాయం మొదలవుతుందని చెబుతున్నారు చిత్ర యూనిట్. త్వరలోనే ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్టు తెలిపారు.






EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY N SREENIVAS RAO, PUBLISHED AT 1-9-18/4-1, RAMNAGAR X ROAD, HYDERABAD. PRINTED AT SRI MATHA PRINTERS,H NO 1-1-562/1,GANDHI NAGAR, HYDERABAD.
REGD NO : APTEL/2003/9316. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034